హనీబీ

సంపుటి 4, సంచిక 3

నవంబర్-డిశంబర్ 2015


# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org



# వెనక్కెళుతున్నామా? దగ్గరవుతున్నామా?



ఒకమనిషి జనసంచారంలేని అడవి ప్రాంతంలో వెళ్తూ వుంటే అకస్మాత్తుగా అతనికి ఒక ఎలుగుబంటి ఎదురు వచ్చింది. అతడు చాలా భయపడిపోయాడు. అయ్యో ఇప్పుడు నేనేం చెయ్యాలి? దేనికైనా సిద్ధంగా ఉండాలి అనుకున్నాడు. అతను ఎలుగు బంట్లు మనుషులని ఏవిధంగా చంపుతాయో విని వున్నాడు కనుక చావుకు కూడా సిద్ధమయ్యాడు.

ఎలుగు అతని దగ్గరగా వచ్చి నిలబడింది. అతను స్థిమితంగా ఉండటానికి ప్రయత్నిస్తూ, ఇప్పుడేం చెయ్యాలి అని ఆలోచించాడు. సరే తన ఖర్మ ఎలావుంటే అలా జరుగుతుంది అని అనుకుంటుండగా అప్పుడతనికి చటుక్కున ఓ ఆలోచన వచ్చింది. అతను ఎలుగుబంటికి దగ్గరగా వెళ్ళాడు. ఎలుగుబంటి నిటారుగా రెండు కాళ్ళపై నిలబడి వుంది. అతను అకస్మాత్తుగా ఎలుగుని కౌగిలించుకుని దాన్ని నిమిరాడు, చక్కలిగిలి పెట్టాడు. దానికి నిద్ర ముంచుకు రావటంతో వెంటనే పడుకుంది. బతుకుజీవుడా అని అతను పరుగు లంకించుకున్నాడు. కొంతదూరం వెళ్ళి వెనక్కి తిరగి చూస్తే ఎలుగు అతన్ని వెనక్కి రమ్మని పిలుస్తోంది.

ఇంతటితో కథ అయిపోయిందా? చాలాకాలంనుంచి ఎలుగుబంట్లు, అలాంటి జంతువులు మనల్ని పిలవటం లేదూ! ఇతర ప్రాణులను మచ్చిక చేసుకోవటమా, ఇతర జీవులతో పరిణామ దశలో ఎవరికి వారు జీవించటమా? అన్న సందిగ్ధత ఈ కథలో నిర్దిష్టంగా కనిపిస్తున్నది. 'గిర్' అభయారణ్యంలో జరిగిన శోధయాత్రలో ఆ ప్రాంతంలో నివసిస్తున్న గొర్రెల కాపరులు మమ్మల్ని ప్రేమతో "గొర్రెలు అభయారణ్యంలోని సింహాలకు ముప్పు అని అనుకుంటున్నారా" అని అడిగారు. దానికై ఒక చిన్న పరీక్ష పెడదామని కూడా సలహా ఇచ్చారు. గొర్రెల కాపర్లు లేని ప్రాంతాలను గుర్తించండి. ఒకవేళ అక్కడ సింహాలు ఎక్కువగా వుంటే మమ్మల్ని దోషులుగా, సింహాలకు ముప్పుగా భావించండి. కానీ, గొర్రెలు ఎక్కువగా వున్న ప్రాంతాలలో సింహాలు ప్రధానంగా కనిపిస్తే, ఆ ప్రాంతం నుండి గొర్రెల కాపరులను తరలిద్దామనుకుంటే సింహాలు కూడా అభయారణ్యం నుండి వారితో వచ్చేస్తాయేమో, జాగ్రత్త.

దీన్నిబట్టి ఆలోచిస్తే మన ఆలోచనా పరిధులను మార్చుకోవాలా అనిపించింది. క్రూరత్వం అంటే ఎంత క్రూరత్వం? అసలు ఏమీ జోక్యం చేసుకోకుండా ఉంటే మనం జంతువుల్ని బాగా సంరక్షించిన వాళ్ళం అవుతామా?

ఒక్కక్షణం ఆలోచించండి!

– హనీబీ 9(3) – 1998 (హబూ– అమెరికా స్థానిక కథ)

# పల్లెసృజన

సంపుటి-4 సంచిక - 3
నవంబర్-డిశంబర్ 2015

## ఈ సంచికలో...


- "అన్ని నేలలకు మినీ టిల్లర్", చిన్న, సన్నకారు రైతులకు ఒక వరం - 3
- 16వ చిన్న శోధయాత్ర - జ్ఞానయాత్ర - 9
- ఒక భారతీయ సగటు రైతు కథ - 14
- 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలు - 18
- బోరుబావిలో పడ్డ చిన్నారులను రక్షించే 'పరికరం' తయారు చేసిన ఆరిపాక రమేష్ - 23
- పల్లెజ్ఞానంతో జీవితంలో వెలుగులు - గోదాసు నర్సింహ జీవన గమనం - 27
- 'పల్లెసృజన' ప్రగతి - 29
- స్పందన - 30

కవర్ లోపలి పేజీల్లో ....
హనీబీ కథ
అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు
మధ్య పేజీ :
అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఇన్నోవేటర్లను సత్కరించిన గవర్నర్
ప్రతి పేజీలో అబ్దుల్ కలాం గారి సూక్తులు



**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్మలమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్మలమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్



ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.
ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
editor@pallesrujana.org
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
040- 40029002
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com


## HoneyBee Regional Collaborators & Publications


**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in


Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# కష్టకాలంలో ముందుకు సాగేదెలా?

ఈ సంవత్సరం రైతులకు అయోమయంగా ఉంది. అధిక ప్రాంతాల్లో అనుకూలమైన వర్షం పడలేదు. కాలువల్లో నీళ్ళు కూడా రైతులకు సరిగ్గా ఇవ్వలేకపోయారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఎలాగోలా పంటలు పండించుకున్నా రైతుకు సరియైన ధర లభించడం లేదు. ముఖ్యంగా ప్రత్తి పండించిన రైతులు నిరాశగా ఉన్నారు. వర్షాధార గ్రామాల్లో బీడుపడిన పొలాలు, నీళ్ళు లేని చెరువులు, కుంటలు కనిపిస్తున్నాయి. రైతులు దిగాలుగా ఏడ్వలేక నవ్వుతున్నారు. వారి దిగులంతా వచ్చే ఆరు నెలల్లో ఏం చేయాలి? ఎలా బ్రతకాలి? పశువులనెలా కాపాడుకోవాలి? వచ్చే సంవత్సరం వానాకాలానికి పెట్టుబడి ఎక్కడినుండి తేవాలి? ఇవన్నీ సగటు రైతు సమస్యలు, ఆవేదన. వీటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కారాలు వెతికి అమలు చేయడానికి ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సేవకులు, రైతు సంఘాలు శాయశక్తులా కృషి చేయాలి. కొంత కృషి జరుగుతోంది. దీన్ని ముమ్మరం చేయాలి. రైతున్నలకు "మేము మీవెనక ఉన్నాం. కలిసి రాబోయే కష్టాలను తీర్చుకుందాం" అన్న విశ్వాసాన్ని కలిగించాలి.

ఈ అసాధారణ పరిస్థితుల్లో రైతులు లభ్యంగా వున్న నీటి వసతితో వచ్చే 5-6 మాసాల్లో ఏం పండించుకోగలమో ఆలోచించాలి. నీం వసతి పెంచుటకై బోర్లను ఇంకా లోతుకి వేయడం, కొత్త బోర్లను తవ్వడం లాంటివి చేపట్టవద్దు. అవి ఖర్చుతో కూడుకున్నవి. నష్టానికి దారితీస్తాయి. ఉన్న నీటితో శ్రీవరి, చిరు ధాన్యాలు, ఉలవలు, నువ్వులు, పెసలు, జొన్న, సజ్జ, దోసకాయలు, అముదాలు వగైరా తక్కువ కాలం పంటలు, తక్కువ నీటి వసతితో పెంచుకోవాలి. ప్రధానంగా విత్తనాలు స్థానికంగా లభించేవి వాడాలి. దిగుమడి ఎంత అన్నది ప్రధానం కాదు, తక్కువ పెట్టుబడితో ఎంత పండినా లాభమే కదా! దక్కన్ డెవలప్‌మెంట్ సంస్థ, జహీరాబాద్‌లో స్థానిక విత్తనాలు లభిస్తాయి. వీటిని తెచ్చుకొని మెట్ట, మాగాణి పొలాల్లో ఈ పంటలను పండించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిరు ధాన్యాల పెంపకానికి ఎంతో చేయూతనిస్తోంది. వీటికి మంచి మార్కెట్‌ను సృష్టించడానికి, రైతుకు ప్రోత్సాహంగా కొన్ని కమిటీలను ఏర్పరచింది. చిరు ధాన్యాలను గ్రామాల్లోనే ప్రాసెస్ చెయ్యడానికి అనుగుణంగా తక్కువ ధరలో యంత్రాలను తయారు చేయడానికి 'పల్లెసృజన' గ్రామీణ శాస్త్రవేత్తలను ఆహ్వానించింది. ఇలాంటి యంత్రాలు గ్రామాల్లో ఉంటే రైతులు చిరు ధాన్యాలను నేరుగా వినియోగదారునికి అందించడం సాధ్యమవుతుంది. అలాగే ఈ సౌకర్యం గ్రామాల్లోని ప్రజలకు చిరు ధాన్యాలను వారి ఆహారంలో భాగంగా చేసుకోవడానికి కూడా వీలవుతుంది. స్థానికంగా కూడా వారు అమ్ముకోవచ్చు. ఇలాంటి సౌకర్యం విరివిగా అన్ని గ్రామాల్లో కల్పిస్తే తెలుగు ప్రజల ఆరోగ్యం బాగు పడుతుంది. రైతుల పంటలకు, కష్టానికి విలువ లభిస్తుంది.

ప్రభుత్వాలు, పారిశ్రామిక సంస్థలు వారి స్వలాభాపేక్షతో బి.టి. (జి.యం.) విత్తనాలను ప్రవేశ పెడుతున్నాయి. దీన్ని మనం నివారించాలి. రైతులు వీటిని వాడటం మానివేస్తే ఏ ప్రభుత్వం కాని, పరిశ్రమ కాని ఏమీ చేయలేవు. ఏ విత్తనం వాడాలో చివరి నిర్ణయం రైతుదే అయినప్పుడు ఇలాంటి హానికర ప్రణాళికలను మనం ఎందుకుప్రోత్సహించాలి?

అలాగే కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రవేశ పెట్టడానికి ప్రభుత్వం ప్రైవేటు సంస్థలు ముమ్మరంగా కృషి చేస్తున్నాయి. ఇది మన దేశంలో ప్రళయాన్ని సృష్టిస్తుంది. కోట్లకొద్ది చిన్న, సన్నకారు రైతులు అనాథలై పోతారు. వారి జీవనాధారం పూర్తిగా కోల్పోతారు. ఇది జరగనీయ కూడదు. సన్న, చిన్నకారు రైతు వ్యవసాయాన్ని లాభకరంగా చేయగలడన్న సత్యాన్ని మనం నిరూపించాలి. పెట్టుబడులను తగ్గించాలి. స్వయం ప్రతిపత్తితో వ్యవసాయం కొనసాగించాలి. ఉన్న నీటితో రకరకాల పంటలు ఏరికోరి సరియైనవి పండించాలి. వేలకొద్ది సన్నకారు రైతులు 3-4 ఎకరాల్లో ఇలాంటి వినూత్న పద్ధతులలో లాభకరంగా వ్యవసాయాన్ని సాగిస్తున్నారు. వారి స్ఫూర్తిగా తీసుకుని మిగతా రైతులు తమ వ్యవసాయాన్ని లాభకరంగా చేయడానికి కృషి చేయాలి. ఇది విస్తారంగా జరిగితే కార్పోరేట్ వ్యవసాయం అమలులోకి రావటానికి ఆస్కారం ఉండదు.

ముళ్ళపూడి సత్యనారాయణ లాంటి అద్భుత గ్రామీణ శాస్త్రవేత్తలు 'పల్లెసృజన'కు పరిచయం కావడం మహాభాగ్యం. ఆయన సృష్టి "సత్యనారాయణ మినీ టిల్లర్" చిన్న, సన్నకారు రైతులకు ఒక వరం. ఈ సంచికలో ఈ ఇన్నోవేషన్‌ను గురించి ప్రచురించాం. త్వరలో ఈ యంత్రం రైతులకు చేరి, వారి కష్టాలను నివారిస్తుందని, లాభాలు రావడానికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాం.

రాబోయే కష్టకాలంలో ధైర్యంగా అంతా కలిసి ముందుకు సాగాలని, వినూత్న ప్రయోగాలతో, సాంప్రదాయ పద్ధతులతో, లభించిన నీటి వసతులతో పంటలు పండించి, ప్రజలను, పశువులను కాపాడుకోవాలని మనసారా ఆశిస్తూ.... ప్రేమాభిమానాలతో.....



భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**




ముళ్ళపూడి సత్యనారాయణ 'పల్లెసృజన' పాఠకులకు చిరపరిచితుడే. గతంలో పత్తి వలిచే యంత్రాన్ని తయారు చేసిన విషయం గుర్తుండే వుంటుంది. తన సృజనాత్మక శక్తిని అంతటితో ఆపలేదతను. సామాన్య రైతుకు కంటగింపుగా మారిన సేద్యాన్ని ఉరకలెత్తించేలా చేయాలన్నదే సత్యనారాయణ తపన. అతని సృజనాత్మక శక్తితో సన్న, చిన్నకారు రైతులకు తమకు తెలియకుండానే పెరుగుతున్న వ్యవసాయ ఖర్చులను మిగిలించే టందుకు ఇప్పుడు సరికొత్త సృజనతో మన ముందుకు వచ్చాడు. సత్యనారాయణ ఖమ్మం జిల్లా, మణుగూరు మండలం, జానంపేట గ్రామ నివాసి.

ప్రపంచీకరణ నేపథ్యంలో దేశ విదేశాల నుండి ఎన్నో వ్యవసాయ పనిముట్లు మనకు మార్కెట్లో లభ్యమౌతున్నాయి. వ్యాపారులు, ప్రభుత్వాలు వాటి పని తీరును, సామర్థ్యాన్ని పరిశీలించకుండా కంటికి ఇంపుగా ఉందని, ఆ అందాన్ని సమర్థతగా భావింపజేసి, చవకైనది, సబ్సిడీలో లభ్యమౌతుందని రైతులను ప్రలోభ పెట్టి వారు కొనేలా చేస్తున్నారు. ఆ విష ప్రచారానికి లొంగిన రైతన్న వాటిని కొని కొద్ది రోజులు వాడిన తర్వాత గాని 'ఇది మన పొలాలకు పనికి రాదు' అని అతనికి తెలిసి రాదు. అప్పటికే వ్యాపారులు, ప్రభుత్వాలకు రావలసిన లాభం వచ్చేసి వుంటుంది. చివరగా నష్టపోయేది రైతన్న మాత్రమే. ఆ యంత్రంతో పని చేయించుకోలేక, దాన్ని బయట పడవేయలేక నానా కష్టాలు పడుతున్నాడు. ఇలా వృధాగా మన రైతులపై రుద్దబడిన వ్యవసాయ పరికరాల్లో "మినీ టిల్లర్" ప్రధాన పాత్ర పోషిస్తుంది. మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కొన్ని వేల మినీ టిల్లర్లు రైతుకు ఎలాంటి పని చేయకుండా వృధాగా అలా మూలన పడివున్నాయి

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**

అనటంలో ఎలాంటి సందేహం లేదు. వీటివల్ల ఇప్పటికే కొన్ని కోట్ల రూపాయలు రైతుల నుండి దోపిడీకి గురయ్యాయి. చైనా వారి టిల్లర్‌లను పరిశీలిస్తే అవి కేవలం చక్రాలపైనే ఆధారపడి తిరుగుతుంది. పొలంలో కాస్త లోడ్ ఎక్కువ అయిందంటే చక్రాలు అక్కడక్కడే తిరుగుతూ ఉంటాయి. లోడు తగ్గిస్తే పైపైనే తిరుగుతూ వేగంగా వెళుతుంది కానీ, పొలం దున్నదు.

ఈ విషయం ముళ్ళపూడి సత్యనారాయణను తీవ్రంగా కలచి వేసింది. ఈమధ్య చైనా పరికరాలతో పాటు మన దేశంలో తయారయ్యే చిన్న చిన్న వ్యవసాయ పరికరాలు మనకు మార్కెట్లో లభిస్తున్నాయి. వాటి బాహ్య రూపాన్ని చూసి, రైతులు కొంటున్నారు కాని, అవి మన పొలాలకు పనికి రావన్న విషయం కొన్న తర్వాత గానీ తెలుసుకోలేక పోతున్నారు. మన దేశంలో ఏ ఒక్క గ్రామంలో కూడా ఒకేరకమైన భూమి ఉండదు. కొన్ని భూములు కఠినమైనవి అయితే మరికొన్ని భూములు తేలికైనవి. ఈ రెండింటికి ఒకే రకమైన పరికరం పని చేస్తుందని ఈ శాస్త్రవేత్తలు, ప్రభుత్వాలు ఎలా ఆలోచిస్తున్నాయో ఎవ్వరికీ అర్థం కాదు.

భూమి ప్రకృతిలో ఒక భాగం. ప్రకృతి వైవిధ్యం అతీతం. టెక్నాలజీ మాత్రం ఒకే మూసలో పోసినట్టుగా వుంటుంది. ఒక యంత్రం ఏ భూమికైతే తయారు చేయబడిందో అక్కడే చక్కగా పని చేస్తుంది. మిగతా భూముల్లో అంత సమర్థవంతంగా పని చేయదు. ఈ పరిజ్ఞానం పరిశ్రమకు, శాస్త్రవేత్తలకు తెలిసినా, స్వలాభంకై రైతులను మోసం చేస్తూ, అన్ని రకాల యంత్రాలను ప్రభుత్వం ద్వారా సబ్సిడీలో అమ్ముతున్నారు. తద్వారా అందరికీ నష్టం కలుగుతోందన్న నిజం మనమంతా గమనించాలి.

సరిగ్గా ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని రెండు సంవత్సరాల నిర్విరామ కృషి సలిపి, దాదాపు ఆరు లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేసి, ఒక అద్భుతమైన, అన్ని ప్రాంతాలకు, అన్ని రకాల భూములకు అనుకూలమైన ఒక 'దృఢమైన మినీ టిల్లర్'ను తయారు చేశాడు సత్యనారాయణ.

ఒకే పొలంలోనైనా సరే ముందుగా దున్నేటపుడు భూమి చాలా గట్టిగా వుంటుంది. దాన్ని ఎక్కువ శక్తితో దున్నాల్సి వుంటుంది. తర్వాత సేద్యం కొంత తేలికగా వుంటుంది. ఆ తర్వాత విత్తనం వేసి, అంతర సేద్యాలు ఇంకా తేలికగా వుంటాయి. ఈ విషయం ప్రతి రైతుకు తెలుసు. కానీ, తన భావాన్ని శాస్త్రవేత్తలకు వివరించి చెప్పలేడు, వారు కూడా వీరి అనుభవాలను తెలుసుకోరు. అది తెలుసుకో కుండా ఒక పరికరాన్ని తయారు చేసి ఇది అన్ని పంటలకు, అన్ని నేలలకు పని చేస్తుంది అని రైతు నెత్తిపై రుద్దుతున్నారు శాస్త్రవేత్తలు, వ్యాపారులు.

ఈ సమస్యను నిశితంగా పరిశీలించిన సత్యనారాయణ తన టిల్లర్‌లో మూడు రకాల గేర్లను ఏర్పాటు చేసి రైతు తనకు అవసరమైనంత బలాన్ని ఉపయోగించి సేద్యం చేసుకునేలా తయారు చేశాడు. అవి పొలం గట్టి తనాన్ని బట్టి అవసరమైన వేగంతో పని చేసుకునేలా వుంటాయి. ఇక రెండోది 'లోడ్ గేర్'. ఇది పొలం యొక్క బలాన్ని గుర్తించి, అవసరమైతే లోడ్ గేర్ వేసుకునేలా అవసరం లేదంటే 'లో గేర్' వేసుకునేలా ఏర్పాటు చేశాడు. ఇక మూడోది 'యంత్రం తిరిగే వేగాన్ని నియంత్రించేది' దీన్నే ఆర్.పి.యం. (రౌండ్స్ పర్ మినిట్) అంటారు. ఇది 'రొటోవేటర్' బ్లేడ్ల వేగాన్ని నియంత్రిస్తుంది. పూర్తి తేలికగా వున్న నేలల్లో ఆర్‌పిఎం పెంచడం ద్వారా సేద్యం త్వరగా, తేలికగా పూర్తవుతుంది. కాస్త గట్టి నేలలైతే ఆర్‌పిఎంను కొద్ది తగ్గించి, రెండో గేర్లో వెళితే కాస్త దృఢమైన సేద్యం చేస్తుంది.



నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.

ఇంకా గట్టి నేలలైతే మొదటి గేర్లో నడుపుతూ, లోడ్ గేర్ వేసి, ఆర్‌పిఎంను ఇంకాస్త తగ్గించేలా తయారు చేయటంతో నిదానంగా బలంగా పొలాన్ని దున్నేలా ఏర్పాటు చేయటం ఈ టిల్లర్ ప్రత్యేకత.

ముళ్ళపూడి సత్యనారాయణ దాదాపు రెండు సంవత్సరాలు కష్టపడి, అన్ని రకాల పొలాలను పరిశీలించి, వాటికి అనువుగా వుండేలా ఈ 'మూడు గేర్ల' వ్యవస్థను అత్యంత సమర్ధవంతంగా తయారు చేశాడు. ఈ గేర్లకు వాడిన మెటల్ కూడా ఎంతో శక్తివంతమైనది కావటంతో ఇవి సమర్ధవంతంగా పనిచేసేలా శ్రద్ధ తీసుకున్నాడు. ఈ టిల్లర్‌లో అత్యంత శక్తివంతమైనది, ఈ గేర్ల విభాగం అని చెప్పక తప్పదు. రైతు ఈ యంత్రాన్ని తీసుకున్న తర్వాత కొన్ని సంవత్సరాల వరకు ఎటువంటి రిపేర్లకు రానంత సమర్ధవంతంగా తయారు చేశాడీ గేర్ల విభాగాన్ని. ఇందులో 'రివర్స్ గేర్'ను కూడా ఏర్పాటు చేయటం చూస్తే ఇతనెంతో గొప్ప ఇంజనీర్ అనిపిస్తుంది.

ఇక రెండోది పొలాన్ని దున్నే 'రొటోవేటర్' బ్లేడ్ల విభాగం. వీటిని తయారు చేయటంలో కూడా ప్రత్యేక శ్రద్ధను కనబర్చాడు. పొలం దున్నటం వల్ల ఎక్కువగా బ్లేడ్లు అరిగి పోతాయి. అటువంటప్పుడు బ్లేడ్లను మొత్తంగా మార్చాలంటే రైతు ఇబ్బందికి గురౌతాడు, ఖర్చు కూడా పెరుగుతుందని భావించి అరిగిన భాగాన్ని మాత్రమే ఆ రైతే స్వయంగా మార్చుకునేలా బ్లేడు వ్యవస్థను అద్భుతంగా తయారు చేశాడు. వీటిని కాస్త లోకజ్ఞానమున్న రైతు తానే స్వయంగా





తన గ్రామంలోని కమ్మరితోనే తయారు చేయించుకుని మార్చుకోగలడు.

ఈ టిల్లర్‌లో ఇన్నోవేటర్ సత్యనారాయణ తన పనితనాన్ని అనూహ్యంగా ఉపయోగించి చేసిన పని యంత్రం యొక్క బరువు సమతుల్యత. దీనికి వినియోగించిన ఇంజన్ బరువు ఎడమ వైపుకు ఎక్కువగా వుంటుందని గ్రహించి, దాదాపు దాని బరువుకు సమానంగా వుండేలా గేరు వ్యవస్థను తయారు చేసి దాన్ని కుడివైపు ఏర్పాటు చేయటంతో యంత్రం బరువు సమతుల్యంగా మారింది. దీనివల్ల యంత్రంతో పని చేస్తున్నపుడు ఎలాంటి కదలికలు లేకుండా సాఫీగా 'ఏనుగు' లాగా పొలంలో పనిచేసుస్తుంది. కొంత అనుభవంతో రైతు ఒంటిచేత్తో ఈ యంత్రాన్ని నడుపుకుంటూ సునాయాసంగా సేద్యం చేయగలిగేలా తయారు చేసినందుకు సత్యనారాయణ ను అభినందించ కుండా ఉండలేం. మార్కెట్‌లో లభించే ఇతర టిల్లర్‌లతో సేద్యం చేయాలంటే దాన్ని నడిపే వ్యక్తి కూడా యంత్రంపై కొద్దిగా బలాన్ని ఉపయోగించి సేద్యం చేయాల్సి వుంటుంది. అందువల్ల దాన్ని నడిపే వ్యక్తి కేవలం పది పదిహేను నిమిషాల్లోనే అలసిపోవటం జరుగుతుంది. కానీ ఈ టిల్లర్‌పై మనిషి ఎలాంటి శక్తిని వినియోగించకుండా కేవలం మార్గదర్శకత్వం చేసుకుంటూ వెళితే యంత్రమే కావలసినంత లోతులో సేద్యం చేస్తుంది.

ఇక మూడవది యంత్రాన్ని ఉపయోగించిన చట్రం. ఇందులోకూడా నాణ్యతను మరువలేదు సత్యనారాయణ.

**మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.**

ఎంతో బలమైన చక్రాన్ని తయారు చేయటంతో ఇది ఎటువంటి పొలంలోనైనా సరే ఎలాంటి సొట్టలు, విరిగి పోవటాలు జరుగకుండా జాగ్రత్తగా తయారు చేశాడు. యంత్రంలోని క్లచ్ విభాగం కూడా సునాయసంగా వినియోగించే ఏర్పాటు చేశాడు. ఈ టిల్లర్‌లో ప్రధానంగా చెప్పుకోవాల్సిన మరొక అంశం యంత్రానికి వెనకవైపున వున్న 'అడ్జస్ట్‌మెంట్ వీల్'. దీన్ని పొలంలో ఏమేరకు దున్నాలో అంతమేరకే ఈ వీల్‌ను అడ్జస్ట్ చేసుకోవచ్చు. దీన్ని తిప్పటానికి కూడా బేరింగును ఏర్పాటు చేయటంతో ఇది చాలా సునాయాసంగా తిరుగుతుంది. దీనివల్ల పొలం గట్టి తనాన్ని, దున్నవలసిన లోతును బట్టి దీని నిడివిని మార్చుకోవాల్సి వుంటుంది.

చివరగా ఈ యంత్రంలో వినియోగించిన టైర్లను గురించి చెప్పుకోవాలి. ప్రస్తుతం తయారు చేసిన యంత్రంలో ఒక అడుగు నిడివిగల టైర్లను వినియోగించాడు. మున్ముందు తయారు చేసే యంత్రాలలో టైరు నిడివి కాస్త పెంచుతానని అంటున్నాడు సత్యనారాయణ. దీనివల్ల ఎటువంటి పొలంలోనైనా ఇంకా సమర్థవంతంగా పని చేసుకోవచ్చు అంటాడీయన. ఇందులో మరో విశేషమేమంటే మాగాణి పనులను చేసుకోవాలనుకున్నా ట్రాక్టరుకు బిగించినట్లుగా ఇనుప చక్రాలను ఈ టైర్ల ప్రక్కనే బిగిస్తే చాలు, టైర్లను తీసి వాటి బిగించుకోవాల్సిన పనిలేదు.

ఈ టిల్లర్ టైర్ల వెడల్పును 16 నుండి 24 అంగుళాల వెడల్పు వరకు మార్చుకునే సదుపాయం కూడా కల్పించాడు. దీనివల్ల రైతు అంతర సేద్యాలలో తనకు అవసరమైన విధంగా వెడల్పును మార్చుకోవచ్చు. రైతు తన పొలాన్ని దున్నటానికి అవసరమైన లోతును, వేగాన్ని నియంత్రించుకునేలా ఏర్పాటు చేయటం విశేషం. పైగా ఈ



సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.

యంత్రం పొలం వరకు వేరే ఎద్దుల బండిలోనో, ట్రాక్టర్‌లోనో తీసుకు వెళ్ళాల్సిన అవసరం లేదు. దీనికి వెనక వైపున అమర్చిన అడ్జస్ట్‌మెంట్ వీల్‌ను తిప్పుకోవటం ద్వారా రోడ్డుపైన బ్లేడ్లు ఆనకుండా నాలుగు అంగుళాలు పైకి ఉండేలా చేసుకుని రోడ్డుపై నడిపించుకు వెళ్ళవచ్చు, అలాగే పొలంలో నాలుగు అంగుళాల లోతు వరకు దున్నుకునేలా కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. యంత్రం యొక్క వేగాన్ని కేవలం క్లచ్ గేర్ల ద్వారానే నియంత్రించుకోవచ్చు కాబట్టి దీని వేగాన్ని నియంత్రించేందుకు ఎక్స్‌లరేటర్ అవసరం లేదు.

ఈ టిల్లర్‌తో అంతర సేద్యాలు చేసే రైతులు ప్రత్తి, పొగాకు, మిరప, చెఱకు, ఉద్యాన పంటలను నాటుకున్న రైతులు సాళ్ళమధ్య దూరాన్ని బట్టి సేద్యం చేసేందుకు అనువుగా టిల్లర్‌లోని బ్లేడ్ల వెడల్పు మార్చుకునే సదుపాయం కూడా వుంది. అందువల్ల వెడల్పు తక్కువగా వుందని ఒకేసారి సాలు మొత్తం దున్నటం లేదన్న బెంగ లేకుండా, సాలు మొత్తం దున్నుకునేలా మార్చుకునే వీలుంది. ఈ వెడల్పును 16 అంగుళాల నుండి 30 అంగుళాల వరకు మార్చుకోవచ్చు. కానీ, ఇక్కడ గమనించాల్సింది ఒకటుంది. వెడల్పు ఎక్కువగా చేయటం వల్ల ఇంజన్‌పై భారం పెరుగుతుంది కాబట్టి ఎక్కువ వెడల్పు చేసుకున్నపుడు గేరు మార్చుకుని టిల్లర్‌ను ఉపయోగించుకోవాలి.

ఈ టిల్లర్ రైతువద్ద వుందంటే రెండు జతల కాడెద్దులు ఉన్నంత సమర్ధంగా దాదాపు పని చేసుకోవచ్చు, సన్నకారు రైతులైతే తమ పొలాన్ని మొత్తం ఈ పరికరం ద్వారానే సేద్యం చేసుకోవచ్చు అంటాడు సత్యనారాయణ.

ప్రస్తుతం మార్కెట్లో లభించే మినీ టిల్లర్‌లను వినియోగించి సేద్యం చేయాలంటే ఆ యంత్రాన్ని నడిపే వ్యక్తి కొద్ది నిమిషాల్లోనే అలసటకు గురౌతాడు. వాటిని నడిపేందుకు ఆ యంత్రాలపై తన వత్తిడిని కూడా ప్రయోగించాల్సి వుంటుంది. పైగా అది చేసే కుదుపులకే అలసిపోతాడు. అలాంటి ఇబ్బందులు లేకుండా తయారు చేశాడీ యంత్రాన్ని.

ఈ టిల్లర్ తయారీకి సత్యనారాయణ తాను పడ్డ కష్టాలు, సాధక బాధకాలను గురించి వివరిస్తూ.... "నేను ఈ యంత్రం తయారు చేయటానికి మార్కెట్లో లభించే దాదాపు అన్ని రకాల టిల్లర్‌లను పరిశీలించాను. ఒక్కోదాంట్లో ఒక్కో లోపం గమనించాను. పైగా ఇవేవీ అన్ని రకాల భూములలో సేద్యం చేయటానికి పనికి రావని నిర్ధారించుకున్నాను. దానికి కారణం, వాటిని కొన్న రైతుల నోటివెంటే విన్నాను. వారు దాన్ని రూపు రేఖలను చూసి, కొనుగోలు చేసే దుకాణం వద్ద చూపిన వీడియోలను చూసి మోసపోయామని, తీరా మా పొలాల్లో ఇది పనికి రాకుండా పోయిందని అన్నారు. చాలా మంది రైతులు వాటిని కొని, కొద్ది రోజులు మాత్రమే వినియోగించుకుని, ఒక మూలన పడేశారు. ఇలా రైతుల మనోభావాలను కళ్ళారా చూశాను. పైగా ప్రతి రైతు వ్యవసాయ పనిముట్ల కొనుగోలులో మోసపోతూనే వున్నాడని గ్రహించాను. మార్కెట్లో లభించే పనిముట్లు కొన్ని పొలాలకు మాత్రమే సరిపోతాయి. పైగా వాటికి వినియోగించిన లోహాలు అతి తొందరగా అరుగుదలకు గురౌతాయి. వాటిని రిపేరు చేయించటానికి ఆ యంత్రాన్ని సమీపంలోని పట్టణానికి తీసుకు వెళ్ళాలంటే రైతు పడే కష్టాలు వర్ణణాతీతం. ఇలాంటివేవీ తన యంత్రంలో ఉండకూడదు అని నిశ్చయించుకుని దీని తయారీకి పూనుకున్నాను. యంత్రం తయారీలో ఎటువంటి చౌకబారు లోహాలను వినియోగించకూడదు అని నిర్ణయించుకున్నాను. నా యంత్రం కొన్న రైతు కొన్ని సంవత్సరాల వరకు ఏ మెకానిక్ వద్దకు వెళ్ళాల్సిన పనిలేకుండా చేయాలి అనుకున్నాను. ఇక పొలలో అరిగే బ్లేడు, గుంటక పలుగు, గొర్రు - నాగలి



ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.

కొయ్యలను కూడా ఆ రైతు తమ ఊర్లోని కమ్మరి వారితోనే చేయించుకుని తానే బిగించుకునేలా తయారు చేయాలి అన్న సంకల్పంతో ఈ యంత్రాన్ని తయారు చేశాను" అంటాడు.

రైతులు పడే కష్టాలను అనుభవించిన ఒకరైతు, కేవలం రైతు సంక్షేమాన్నే కాంక్షించి ఒక యంత్రం తయారు చేయటం ఎంతో అభినందనీయం. అదీ కాక, ముఖ్యంగా ఈ యంత్రంలో వినియోగించిన 'గేర్ బాక్స్' తయారు చేయటం ఎంతో అనుభవమున్న ఇంజనీర్లు చేయగలిగే పని. అలాంటి పనిని ఒక సామాన్య రైతు తన తోటి రైతులు కష్టాలపాలు కాకుండా తయారు చేసిన ఈ "మినీ టిల్లర్" తప్పకుండా అందరు రైతుల ప్రశంసలను అందుకుంటుంది అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇంత అద్భుతమైన ఇన్నోవేషన్‌ను అందించిన గ్రామీణ శాస్త్రవేత్త ముళ్ళపూడి సత్యనారాయణ నిజమైన "రైతు ఆపద్బాంధవుడు".

దేశంలోని సన్న, చిన్నకారు రైతులు ఈ యంత్రాన్ని వినియోగించుకుని తమ పొలం పనులను సునాయాసంగా, తక్కువ ఖర్చుతో చేసుకుని లాభాల బాట పట్టాలని "పల్లెసృజన" మనసారా కోరుకుంటోంది. సత్యనారాయణ టిల్లర్ పేటెంటుకై దరఖాస్తు చేయబడింది. 'పల్లెసృజన' ఈ టిల్లర్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు రావటానికి ఎన్.ఐ.ఎఫ్. ద్వారా కృషి చేస్తున్నది. ఈ యంత్రం అతి త్వరలో మార్కెట్‌లోకి విడుదల కాబోతోంది.

టిల్లర్ కొనదలచిన వారు "సుభాష్, ఫోన్ నెం. 9652 801700"లో సంప్రదించ గలరు.

ఇన్నోవేటర్ వివరాలు :**ముళ్ళపూడి సత్యనారాయణ, ఫోన్ నెం. : 90002 50692** ●

# 'పల్లెసృజన' సమానాంతర వ్యాప్తికి "మరో నిదర్శనం"

'పల్లెసృజన' వల్ల యాజమాన్యానికి కూడా తెలియకుండా పాఠకులు ప్రజల జ్ఞానం వ్యాప్తి చెందిస్తున్నారు. మేము కోరుకుంటున్నది కూడా ఇదే. ఇందుకు నిదర్శనం ఇటీవలే జరిగిన మరో తార్కాణం. జులై-ఆగస్టు-15 పల్లెసృజన సంచికలో కర్నూలు జిల్లా, కోయిలకుంట్ల ప్రాంతానికి చెందిన సూర్య తయారు చేసిన సాంప్రదాయ వైద్యాన్ని గురించిన కథనం ప్రచురించడం జరిగింది. కానీ, ఆ జ్ఞానకర్త 'సూర్య' తన వ్యక్తిగత సమస్యల దృష్ట్యా, మేము ప్రచురించిన 'సంవేదనతో సాంప్రదాయ జ్ఞానాన్ని ప్రజల క్షేమం కోసం వాడుతున్న యువరైతు సూర్య' అనే కథనం గుంటూరు జిల్లా 'రత్నగిరి రావు' అనే ఒక పాఠకుడ్ని ఆకట్టుకుంది. అతని సమస్యలకు సూర్య ఔషధం సరియైన పరిష్కారం అనుకుని 'పల్లెసృజన'కు ఫోన్ చేయగా, ఆ జ్ఞానకర్త ఫోన్ నెంబరును ఆయనకు తెలియజేయలేక పోయాం. ఎలాగైనా సరే ఇతన్ని కలుసుకోవాలని, కర్నూలు జిల్లా కోయిలకుంట్ల తాలూకా, సంజామల మండలంలో విచారించేందుకు దాదాపు నాలుగైదు గ్రామాలను తిరిగి మొత్తానికి సూర్య గ్రామాన్ని కనుగొనటం, అతనితో ప్రత్యక్షంగా మాట్లాడి తన సమస్యను వివరించి, అందుకు తగ్గ ఔషధం తయారు చేయమని కోరుకోవటం జరిగింది.

తెలుగు ప్రజల జ్ఞాన పిపాసను ప్రోత్సహించి, సమానాంతరంగా గ్రామీణ ప్రజల మధ్య జ్ఞాన చర్చలు సాధ్యం చేయాలని, తద్వారా సమాజమంతా జ్ఞాన వ్యాప్తితో లాభ పడాలన్న 'పల్లెసృజన' తపనకు ఇదొక చిన్న తార్కాణం.

**NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ**

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia. org లో చూడవచ్చు.
అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే
**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**
కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.
కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.**

తూర్పు గోదావరిజిల్లా 'సున్నంపాడు' నుండి 'రామణయ్య పేట' వరకు 2015 సెప్టెంబర్ 25-27 వరకు జరిగిన

# 16వ చిన్న శోధయాత్ర - జ్ఞానయాత్ర

## యాత్రీకుల అనుభవాలు

- జె. శశిమోహన్



తూర్పు గోదావరి జిల్లాలోని సున్నంపాడు గ్రామంలో ప్రారంభమై, దాదాపు 60 కిలోమీటర్లు సాగి రామణయ్యపేట గ్రామంలో ముగిసిన 16వ చిన్నశోధయాత్ర 25–27 సెప్టెంబర్, 2015లో జరిగింది. ఈ యాత్రలో స్వచ్ఛందంగా పాల్గొన్న కొందరు యాత్రీకుల అనుభవాలు, మనో భావాలు మీముందుంచుతున్నాం.

..... నాపేరు శ్రీనివాసులు, నేను కర్నూలు జిల్లాకు చెందినవాన్ని. ఈ శోధయాత్రలో పాల్గొనటం నాకు మొదటిసారి. ఈ యాత్రలో ఎంతోమంది చదువుకున్నవారు, మేధావులు, ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, మహిళలు..... ఇంకా చాలామంది పాల్గొన్నారు. నేను పల్లెటూరు నుంచి వచ్చినా వీరందరితో కలిసి పల్లెలను చూడటం కొత్తగా అనిపించింది. నిజం చెప్పాలంటే నేను మొదటిసారిగా పల్లెలను ఒక కొత్త కోణంలో చూశాను. ఎంతో తెలిసిన వారు ఏమీ తెలియదని (అనుకునే) పల్లెవాసుల గురించి, వారి మేధస్సు గురించి, వారి ఆప్యాయత గురించి చెపుతూ వుంటే నిజమే కదా అనిపించింది. ఎవరో చెప్పేంత వరకు మన గురించి మనకు తెలియదా అనిపించింది.

'పల్లెసృజన' కేవలం జ్ఞానాన్ని పంచే సంస్థే కాదు, ఒక మంచి సంస్కృతిని కూడా పంచుతోంది అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. పల్లె జ్ఞానాన్ని మెచ్చుకొని, ఒప్పుకునే సంస్కారాన్ని పల్లెసృజన శోధయాత్రీకులకు నేర్పుతుంది, గ్రామాల్లో వ్యాప్తి చేస్తుంది. ఈ యాత్రలో తోటి యాత్రీకుల నుంచి, పల్లె జనం నుంచి ఎంతో నేర్చుకున్నాను. అందరికీ నా కృతజ్ఞతలు.

**పి.సి. వెంగయ్య:**

21వ తేదీనాడే నేను ఈ యాత్ర గురించి శ్రీనివాస్, రాజు గార్లతో చర్చించాను. 26వ తేదీన నాకు ఆఫీసులో మీటింగు ఉంది. చాలా ఆలోచించి ఒక నిర్ణయం తీసుకుని, బ్రిగేడియర్ గారు, మరికొందరితో కలిసి 25వతేది ఉదయం బయలుదేరి 'రంపచోడవరం' చేరుకుని, ఆల్పాహారం

**మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.**

ముగించి, 'సున్నంపాడు' గ్రామంలో ఇతర యాత్రీకులను కలుసుకున్నాను. ఈ యాత్రలో నా అనుభవాలు....

❀ ఎక్కడ మారుమూల బడిలోనైనా పిల్లలు చాలా క్రమశిక్షణతో ఉన్నారు.

❀ ఒక గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా వుంది. పంటలను కూడా నష్టం చేస్తున్నాయి. ఇంతకుముందు ఈ బాధ లేదట. ఎవరో ప్రక్కనున్న పట్నం నుంచి తెచ్చి రాత్రికి రాత్రే ఇక్కడ వదిలేశారట.

❀ కొన్నిచోట్ల మగవారు మద్యానికి బానిసలు కావటంతో ఇంటిని నడిపే పని ఆడవారిపై పడుతోంది. ప్రభుత్వం నుంచి ఉచితంగా వచ్చే పథకాలు తీసుకోవటం తమ హక్కు అనుకుంటున్నారు. తమ కాళ్ళపై తాము నిలబడాలని ఆలోచించడం లేదు.

❀ ఒక గ్రామంలో 'గాలిదుక్కి' అనే కలుపు మొక్క విరివిగా పెరిగి పంటలను నాశనం చేస్తోంది. దాని విరుగుడుకై ప్రయత్నాలు చేస్తూ వున్నారు. మన ఇన్నోవేటర్లే ఎవరైనా ఏమైనా చేస్తే బావుంటుంది.

❀ ఈ యాత్రలో పసుపు ఎలా తయారౌతుందో తెలుసుకున్నాను. అంజిరెడ్డి గారి దగ్గరనుండి వ్యవసాయం గురించి ఎంతో తెలుసుకున్నాను. ఆయనకి వ్యవసాయం గురించి తెలియనిది లేదేమో అనిపించింది.

❀ శ్రీపాద కళాశాల విద్యార్థులు, పద్మగారు, మాధవిగారు, ఫయాజ్, రత్నాకర్ రావు, మనోజ్, రాజు, పూర్ణ, శ్రీనివాస్, వికాస్.... ఇంకా ఎంతోమందికి ఈ యాత్ర కష్టం తెలియకుండా గడిచిపోయింది. మాకు తెలియని





విషయాలెన్నో గణేశం గారు తెలియజేశారు. ఆయన ఓపికకు మెచ్చుకోవాలి.

యాత్ర పూర్తయిన తర్వాత పల్లెలని, పల్లెటూరి వాళ్ళని తక్కువ అంచనా వేయకూడదు, వాళ్ళూ చాలా తెలివైన వాళ్ళు అనిపించింది.

**శ్రీపాద కళాశాల, విశాఖపట్నం విద్యార్థులు : హేమ, ప్రియాంక, మణికంఠ, త్రివేణి, దుర్గాప్రసాద్, త్రినాథ్‌ల అభిప్రాయాలు:**

మా జీవితాలని రెండు భాగాలుగా చేయవచ్చు. శోధయాత్రకి ముందు, శోధయాత్ర తర్వాత. ఒక ఆలోచన జీవితాన్నే మార్చేస్తుంది అన్నట్టు ఈ యాత్ర మా జీవితాలలో మా ఆలోచనా సరళినే మార్చివేసింది. మన జీవితాలు కొనసాగేలా చేస్తున్న రైతుల జ్ఞానాన్ని అవగాహన చేస్తోన్న ఈ యాత్ర అపూర్వం.

**సున్నంపాడు గ్రామం :**

ఇక్కడ బడిపిల్లలు వాళ్ళ బడి చుట్టుప్రక్కల దొరికే గడ్డిని, పూలను తీసుకు వచ్చి మాకు స్వాగతం పలికారు. అందులో వాళ్ళ క్రమశిక్షణ, ప్రేమ, ఆప్యాయత, ప్రకృతితో వాళ్ళకున్న అనుబంధం, ఉన్నదాంతో సరిపెట్టుకోవాలనే తత్వం..... ఇంకా ఎన్నో విషయాలు అర్థం చేసుకోవచ్చు.

14 మంది సభ్యులున్న ఉమ్మడి కుటుంబం నూకాలమ్మది. కొడుకులు, కోడళ్ళు, మనుమలు, మనుమరాండ్రు... వాళ్ళమధ్య ఆప్యాయతలు, అనుబంధాలు..... మన పట్టణాలలో ముగ్గురు నలుగురు

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**



సభ్యులు ఉండే చిన్న కుటుంబాలను వీరితో పోలిస్తే ఎంత మిస్సవుతున్నామో అనిపించింది.

జీడిమామిడి, మామిడి, తియ్య జొన్నలు, రాగి, కొర్రలు పండిస్తారిక్కడి ప్రజలు. నీటి కొరత ఉంది. త్రాగేనీరు కూడా శుభ్రంగా ఉండటం లేదు. చేతికొచ్చిన పంటలను కోతులు నాశనం చేస్తున్నాయి...... ఆప్యాయంగా పలకరించి ఆతిథ్యమిచ్చారు.

**నూరుపూడి :**

70 గడపలు, 300 జనాభా వున్న గ్రామం. గ్రామంలో రెండు గుంపులు..... రెడ్లు, దొరలు. మన ఆచారాలకన్నా వీళ్ళ ఆచారాలే మేలనిపించింది. ఎందుకంటే ఇక్కడ ప్రేమ వివాహాలు ఒప్పుకుంటారు. కట్నం తీసుకోరు... బాల్య వివాహాలుండవు..... తగాదాలొస్తే కోర్టులకెళ్ళకుండా వాళ్ళే పరిష్కరించుకుంటారు. ఈ ఊళ్ళో మంగమ్మ అనే మహిళ ఆ గ్రామానికే స్ఫూర్తిదాయకం అని తెలుసుకున్నాను. అలాంటి వాళ్ళు ఊరికొక్కరుంటే చాలదా!

**దొరమామిడి :**

యాత్ర మొదటిరోజు రాత్రి ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో బస చేశాము. ఒక దయగల జంట భోజనం వండి కొసరి కొసరి తినిపించింది. ఎంతో రుచిగా అనిపించింది. తర్వాత పడుకునే ముందు యాత్రీకులమంతా ఒకరి అభిప్రాయాలు ఒకరికి చెప్పుకున్నాం. అవి వింటూవుంటే ఒక విషయాన్ని వేరువేరు వ్యక్తులు వేర్వేరు పద్ధతుల్లో చూస్తారు కదా అనిపించింది. అసలు అదే ఇన్నోవేషన్లకి మూలమేమో అనిపించింది.

ఒకవ్యక్తి తాను చేసిన నాగలిని చూపించాడు. ఏ కంపాసు, స్కేలు లేకుండా అంత ఖచ్చితమైన కొలతలతో ఎంత బాగా చేశాడో అనిపించింది. అతని నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయాం.

**బూసి గూడెం :**

ఇక్కడ ఒక పాఠశాల పిల్లలను కలిశాం. పైకి ప్రదర్శించకపోయినా, వాళ్ళు బాగా క్రమశిక్షణ కలిగి వున్నారని, వారిమధ్య మంచి అవగాహన ఉన్నదని అర్థమైంది. పైపై రూపు చూసి మనషులపై ఒక అభిప్రాయానికి రాకూడదు అనిపించింది. ఇదొక విలువైన జీవిత పాఠం.

**రంప :**

ఈ గ్రామంలో దాదాపు 100 సంవత్సరాల పైబడ్డ వయస్సున్న ఒక ముసలావిడను కలిశాం. ఆమె అల్లూరి సీతారామరాజు బంధువట! నిన్నమొన్న జరిగినట్లుగా ఆమె పాత విషయాలు, సీతారామరాజు కథలు, ఆ గ్రామ రాజు వివరాలు చెప్తుంటే ఆశ్చర్యం వేసింది. మనకిప్పుడు కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు ఉన్నా ఏదీ గుర్తుండటం లేదు. చివరికి ఫోన్ నెంబర్లు కూడా..... అలాంటిది ఆమె ఎప్పుడో జరిగిన విషయాలు, సంగతులు కళ్ళకు కట్టినట్లు అంత బాగా చెప్తూవుంటే ఆశ్చర్యమేసింది. ఎంతైనా ఆకాలం మనుషులు వేరు.

బ్రిగేడియర్ గణేశం గారినుండి విక్రం రాథోడ్ సైకిల్ పంపు, గోపాల్ భీసే సైకిల్ నాగలి, మహిపాల్ వీడరు, బ్రహ్మచారి మినీ ట్రాక్టరు, ముక్కు ఫిల్టరు ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లను గురించి తెలుసుకున్నాం. ఆ రాత్రి యాత్రలో



**కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.**



మేము తెలుసుకున్న విషయాలను ఒకళ్ళ కొకరం చెప్పుకుంటూ, దోమలనుండి రక్షణగా చంద్రశఖర్ గారి శ్రీతైలం పూసుకుని నిద్రకుపక్రమించాం.

ఈ యాత్రలో పాల్గొన్న ప్రతి వ్యక్తికి ఒక ప్రత్యేక వ్యక్తిత్వముంది. అందరూ లాభపడ్డారని ఖచ్చితంగా చెప్పవచ్చు. పూర్వానుభవం వున్నవారిదగ్గరనుండి ఎన్నో విషయాలను తెలుసుకోగలిగాం.

గణేశం గారి లాంటి వ్యక్తిని మేమింతవరకు చూడలేదు. ఇతరులను ప్రోత్సహించడంలో, వివరాలు చెప్పడంలో, ఓపికలో ..... చాలా తెలుసుకున్నామాయన దగ్గరనుండి. అబ్దుల్ కలాం గారిలా ఇన్నోవేషన్లను ప్రోత్సహించడంలో ఈయన చేస్తున్న కృషి చాలా గొప్పది.

వికాస్ ఈ దేశ యువతకి ఆదర్శమనిపించింది, ప్రతిదీ ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాడు. పద్మ, మాధవిలు దయగల తల్లులు, ధైర్యంగల వనితలు. స్వంత ఊళ్ళకి సేవ చేయాలనుకునేవారందరికి వీళ్ళిచ్చే ప్రోత్సాహం అమోఘం. ఈ యాత్రలో అన్ని ఏర్పాట్లు చేస్తూ ఎవరికి ఏ ఇబ్బంది కలగకుండా చూసిన నవీన్, శ్రీనివాస్, మధు, రాజు అందరికీ ధన్యవాదాలు. శ్రీనివాస రెడ్డి ప్రకృతితో మమేకమైన వ్యక్తి ఎన్నో విషయాలు చెప్పాడు. మొత్తానికి ఈ యాత్రలో నిజమైన ఒక కొత్త జీవితం చూశాము అనిపించింది.

**పూర్ణ, రాజు, మనోజ్ ఇంకొందరి అభిప్రాయాలు....**

ముగ్గురం నెల్లూరు నుండి 24 నాడు రాజమండ్రికి బయలుదేరాం. అక్కడినుండి మూడు బస్సులు మారి గోకవరం, రంపచోడవరం మీదుగా 'సున్నంపాడు' చేరుకుని ఇతర యాత్రీకులను కలుసుకున్నాం. ఇక్కడ పాఠశాలలో పిల్లలు టీచర్లు లేకపోయినా వారంతటా వారే ప్రార్థన పూర్తి చేయటం చూస్తే ముచ్చటేసింది. వాళ్ళతో మాట్లడుతూ వుంటే ఆ చిన్న మెదళ్లలో ఎంతెంత పెద్ద ఆలోచనలు ఉన్నాయో కదా అనిపించింది. ఊరి పెద్దలను కలిస్తే వాళ్ళు వాళ్ళ కాలానికి, ఇప్పటికీ ఉన్న తేడాను చెప్తూ వుంటే ఆరోజులే బాగున్నాయేమో అనిపించింది. చాలామంది కోతుల బెడద గురించి చెప్పారు. మనిషి తన స్వార్థం కోసం అడవులను నరికేస్తూ వుంటే పాపం అవిమాత్రం ఏం చేస్తాయి? అవీ బ్రతకాలి కదా! గ్రామస్తులతో మాట్లాడుతూ వుంటే కొన్ని ఆసక్తికరమైన వివరాలు తెలిశాయి. వాళ్ళు పశువుల పాలు పితికి వాడకుండా దూడలకే వదిలి వేస్తారట! అదేంటని అడిగితే పాపం నోరులేని జీవాలు, వాటి ఆలనా పాలనా మనం కాకపోతే ఎవరు చూస్తారు సార్ అన్నారు. ఎంత అవగాహన వుందో వీళ్ళలో అనిపించింది. మనిషులు, పశువులు కలిసి జీవించడమంటే ఇదేనేమో! ప్రతి ఇంట్లో పళ్ళు, కూరగాయలు, మందులకి అని 10 నుండి 20 మొక్కలు తప్పనిసరిగా పెంచుకుంటారట. 108 వైద్య సదుపాయం ఉంది కదా అని ప్రతి చిన్న రోగానికి డాక్టర్లు, ఆసుపత్రుల చుట్టూ తిరిగేకన్నా, హానికరం కాని పెరటిచెట్ల వైద్యం చేసుకుంటే మంచిది కదా అని సలహా ఇచ్చాం వారికి.

అక్కడినుంచి యాత్ర ముందుకు సాగాక అక్కడి ప్రాంత ప్రజలు వాళ్ళ నీటి అవసరాలు 'సత్య సాయి ట్రస్టు' వారు తీరుస్తున్నారని, పిల్లలు చదువుకోవడానికే బడి లేదు



దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.



అని చెప్పారు. శ్రీ మనోహర్ ప్రసాద్ గారి ఆట – పాట – బడి పద్ధతిలో శిక్షణ పొందిన 'మంగమ్మ' అనే యువ మహిళ ఆ ఊళ్ళో అందరికీ కనీసం సంతకం పెట్టేంత చదువు నేర్పించటానికి ప్రయత్నిస్తోంది అని తెలిసింది. యాత్రీకులంతా ఆమెనెంతో అభినందించారు.

మొదటిరోజు కొండ ప్రాంతాల్లో 'కాంటూర్' వ్యవసాయ పద్ధతి, తాటిచెట్ల నుండి శాస్త్రవేత్తలు ఉపయోగకరమైన 40 రకాల ఉత్పత్తులను తయారు చేయటం, గ్రామాల్లో ఉండకుండా పట్టణాల్లో ఉండేవాళ్ళంతా తమతమ గ్రామాలకి 'పల్లెసృజన' పత్రిక అందేలా చేసే పథకం, గ్రామ స్థాయి ఇన్నోవేటర్లను ప్రోత్సహించడానికి ఒక ఇన్నోవేటర్ల పాఠశాలో, కళాశాలో అవసరం లాంటి అనేక విషయాల గురించి తెలుసుకున్నాం.

రెండోరోజు పక్షుల కిలకిలా రావాల మధ్య అడవిలో సెలయేట్లో స్నానాలు చేయటం ఓ కొత్త అనుభవం. చాలా బాగా అనిపించింది. వచ్చి గ్రామస్తులతో మాట్లాడుతూ వుంటే ఒకతను తాను కేవలం 6 గంటలలో ఏ ఆధునిక పనిముట్ల సహాయం లేకుండా ఖచ్చితమైన కొలతలు గల నాగలి తయారు చేశానని చూపించాడు. అతనిని ఎంతో అభినందించాం. తమ అనుభవాలను మాతో పంచుకున్న వృద్ధ దంపతులను సత్కరించి ముందుకు సాగాం. 'బూసిగూడెం'లో 400 మంది బాలికలు చదువుతున్న ఒక పాఠశాలలో పనిముట్లు తీసుకుని పిల్లలకి ఇన్నోవేషన్లను గురించి వివరిస్తూవుంటే వాళ్ళ స్పందన చూసి ఆశ్చర్యపోయాం. వాళ్ళ ఆలోచనలకి అబ్బురపడ్డాం.

గ్రామస్థాయి ఇన్నోవేటర్లను గురించి చర్చించుకుంటూ (అంటే గణేశం గారు చెప్తూవుంటే మేము వింటూ) రంపచోడవరం వైపు మేము బయల్దేరాం. పెద్ద వర్షం వచ్చింది. అయినా అలాగే ముందుకు సాగాం. సరదాగా అనిపించింది. ప్రకృతితో కలిసి పోయాము అనిపించింది. అక్కడ ఒక ప్రాథమిక పాఠశాలలో బస చేశాము. ఈరోజు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం యొక్క లాభాలు, తులసి మొక్క వలన లాభాలు, మల్లేశం గారి లక్ష్మి ఆసు యంత్రం ఆ ప్రాంతంలో తెచ్చిన మార్పు, ఆట–పాట–బడి చదువు వివరాలు, బ్రిగేడియర్ గారిని చూసి స్ఫూర్తి చెంది రోజంతా తానూ కూర్చోకుండా నిలబడి వున్న 'హేమ' అనే యాత్రీకురాలి పట్టుదల..... ఇలా చాలా విషయాలు తెలుసుకున్నాం.

మర్నాడు యాత్ర చివరి రోజు..... ప్రొద్దున్నే 'రంప' జలపాతానికి వెళ్ళి అక్కడ స్నానం చేశాం. ఊర్లో అల్లూరి సీతారామరాజు గారి కోడలు 'వెంట రత్నం' గారిని చూశాం. ఆమె వయస్సు 100 సంవత్సరాలకి పైనే వుండొచ్చు! ఆమె వివరంగా పాత సంగతులు అనేకం చెప్పింది. చక్కగా వినగలదు, స్పష్టంగా మాట్లాడగలదు. అల్లూరి సీతారామరాజుని కొత్తకోణంలో పరిచయం చేసిందామె. ఆక్కడినుంచి 'రంపచోడవరం' బయలుదేరాం. ఎండ కొంచెం ఎక్కువగానే వుంది. తోవలో అలసిపోయిన మాకు ఇంటర్ చదువుతున్న ఒకామె చల్లని నీళ్ళిచ్చి ఆదుకుంది. దేవతా కనిపించింది. రంపచోడవరంలో గ్రామస్తులతో ఇన్నోవేషన్లను గురించి చర్చించాం. వారిలో కొందరు 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే జానపద గీతం పాడారు. మనం సినిమాల్లో ఇక్కడినుంచే వచ్చిందా అని తెలుసుకున్నాం. కొంతసేపయ్యాక తిరిగి వెళ్ళవలసిన వాళ్ళకి ఆలస్యమవుతుందని యాత్ర ముగించాం.

ఈ యాత్రలో అనేకమంది వ్యక్తులు, అనేక రకాల వ్యక్తులు, అనేక చదువులు చదివిన వ్యక్తులు, అనేక దృక్పథా లున్న వ్యక్తులను కలవటం వలన అనేక విషయాలను తెలుసు కునే అవకాశం వచ్చింది. ఈ శోధయాత్ర మా జీవితాలకి ఒక కొత్త కోణం చూపించిందని ఖచ్చితంగా చెప్పగలం. ●

**నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.**

# ఒక భారతీయ సగటు రైతు కథ

ధారావాహికం 3వ భాగం

- చల్లా కృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా.

అప్పటికి నా వయసు సుమారు 21 సంవత్సరాలు ఉండవచ్చు అనుకుంటున్నాను. ఆరోజు చివరగా నా జేబులో పది రూపాయల నోటు ఉన్నది. భోజనమునకు క్యాంటీన్‌కు వెళ్ళాను. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో భోజనం అప్పుడు 5 రూపాయలు మాత్రమే. అక్కడ ఒక సాధువు నాకు భోజనం టికెట్టు ఇప్పించమని కోరినాడు. నాకు, ఆ సాధువుకు భోజనం టికెట్టు కొని ఒకటి ఆ సాధువుకిచ్చి నేను భోంచేశాను. ఆరోజు నేను సాయంత్రం వరకు వేచియున్నాను. దేవుని నుండి ఏదైనా సంకేతం వస్తుందా?



డబ్బు పూర్తిగా అయిపోయింది. అనుకొన్న మాట ప్రకారం ఏదో ఒకటి చెయ్యాలి. తెల్లవారి ఉదయం 10 గంటలయింది. డబ్బు లేదు ఇక కాలం దగ్గరయింది అని దగ్గరలో వున్న మూడు అంతస్తుల భవనం ఎక్కి క్రిందకు చూశాను. ఒక్కడినుండి మనిషి క్రింద పడితే చనిపోవటానికి వీలున్నదా అని ఆలోచించాను. ఇంకా కొంత ఎక్కువ ఎత్తు ఉంటే మంచిదేమో అనిపించింది. కానీ ఆ ప్రాంతంలో అంతకు మించి ఎత్తయిన భవనం లేకపోయింది. భగవంతుడు నిర్ణయించిన స్థలం ఇదేనేమోనని భావించాను. ఆ బిల్డింగ్‌పై ఎవరో ఒకరు నిద్రపోతున్నారు. నా ప్రయత్నం దేవుడు విఫలం చెయ్యాలన్నా చెయ్యగలడు. నేను ఆ ప్రయత్నం చేస్తున్నపుడు ఎవరో ఒకళ్ళు వచ్చి ఆపవచ్చు, జరగవలసింది జరుగుతుంది. ఏం జరుగబోతున్నదో చూద్దాం అనుకున్నాను. దేవునికోసం మేము త్యాగాలు చేస్తాము, దానాలు చేస్తాము అని పైకి చెప్పుకోవటమే గాని నిజంగా ఆయన ఉనికిని తెలుసుకొనేందుకు ఏదైనా ఎవరైనా ప్రయత్నం చేశారు అంటే, పూర్వకాలంలో 'రావణాసురుడు' – లంకాపతి ఆ కాలంలో, రామక్రిష్ణ పరమహంస – కలకత్తా నివాసి ఇటీవల. అంతే. తర్వాత దేవునికోసం ఏదైనా సాహసం చేసిన వారెవ్వరున్నారో నాకు తెలియదు. ఆ సాహసం నేను చెయ్యాలని సంకల్పించినందుకు నాకు ఎంతో ఆనందంగా అనిపించింది.

అలా నిర్ణయించుకొని చివరిసారిగా చీటీలమీద దేవునికోసమే నేను ప్రయత్నం చేస్తున్నాను, నాకు ఏమి జరిగిననూ దేవుడే బాధ్యత వహించవలసి ఉంటుంది. అని వ్రాసి క్రిందికి వదిలేశాను. భగవాన్ అని పెద్దగా కేక వేస్తూ క్రిందకి దూకేశాను. క్రింద పడటం నాకు తెలియలేదు. అలా ఎంతసేపైందో కూడా తెలియదు. నేనింకా క్రింద పడకుండా పైననే పడుకొని ఆకాశంలో వేలాడుతూ కళ్ళు మూసుకొని

**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది, ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్ములను గొప్పవాళ్ళను చేస్తుంది.**

పడుకొని ఉన్నట్లు అనిపిస్తున్నది. ఏవిధమైన నొప్పిగానీ, బాధగానీ లేదు. ఇతరుల మాటలు మాత్రం వినిపిస్తున్నాయి. అయ్యో పాపం పిల్లవాడు ఇతనికి మూర్ఛలు ఏమైనా ఉన్నాయేమో అనుకుంటూ జనం గుమికూడి వారి వారి అభిప్రాయాలను వారు వెల్లడిస్తూ ఉన్నారు. అన్నీ నాకు స్పష్టంగా వినిపిస్తూనే వున్నాయి. కానీ, నేనింకనూ అప్పటికి నా శరీరంలోనికి ప్రవేశించి యుండలేదు పైనే వేలాడుతూ ఉన్నట్లనిపిస్తున్నది. ఒకతను ఎవరో అతని చేతిలో తాళాలు పెట్టండి మూర్ఛ అయితే అతనికి మెలకువ వస్తుంది అని చెప్తున్నాడు. ఎవరో నా చేతికి తాళంచెవులు అందించారు. అప్పుడు నేను నా శరీరంతో పూర్తిగా మమేకం అయ్యాను. నా కళ్ళతో శరీర పరిస్థితిని చూసుకున్నాను. ఎటు కదలాలన్నా కదలకుండా ఉన్నాను. కేవలం చేతులు మాత్రం కదులుతున్నాయి. మామూలుగా పని చేస్తున్నాయి. స్ట్రెచర్‌పై నన్ను ఆసుపత్రికి చేర్చారు.

అప్పుడు బాబా అనుచరులు కొందరు వచ్చి నీ వెన్నుపూస చీలిపోయింది, వెంటనే బాగుచేసి పంపిస్తాము, ఇంటికి వెళతావా అని అడిగారు. కాదు నేను దేవున్ని తెలుసు కునేందుకే వచ్చినాను, అది నాకు సంక్రమించే వరకు వెళ్ళేది లేదు అని చెప్పాను. ఎలా జరిగింది అని అడిగారు. నేనే కావాలని దూకినాను అన్నాను. అయితే నిన్ను అనంతపురం పెద్దాసుపత్రిలో చేరుస్తాము, అక్కడ నీవు ఇలా చెప్పవద్దు, నిద్రపోతూ గోడమీద నుండి దొర్లి పడినాను అని చెప్పు, నీకు వైద్యం చేస్తారు అని చెప్పారు. చేసేది లేక సరే అలాగే చెప్తానులే అని అనంతపురం ఆసుపత్రిలో చేర్చేటపుడు స్టేట్‌మెంట్ వ్రాసుకున్నారు. గోడపైనుండి దొర్లి పడిపోయినట్లుగా వ్రాసుకొని వైద్యం చేస్తున్నారు. నేను ఒంటరి వాడిని, నర్సు నా దగ్గరికి కూడా రావటం లేదు. నా స్థితి ఎందుకిలా అయిందా అని ఆలోచిస్తూ భగవంతుని ఆలోచన తప్ప వేరు ఆలోచన రావటం లేదు. 3 రోజులు నిద్రపోలేదు.

తర్వాత మీ వాళ్ళకి లెటరు వ్రాసి ఇక్కడకు రమ్మని చెప్తాము అని ఆసుపత్రివారు నావద్ద మా ఊరి చిరునామా తీసుకొని జాబు వ్రాస్తే మా బంధువు ఇంతకుముందు నాకు పుట్టపర్తి అడ్రసు చెప్పినతను ఆసుపత్రికి వచ్చి, ఇక్కడ ఉంటే మా వాళ్ళు ఇతని దగ్గరికి రావటానికి, పోవటానికి చాలా దూరమవుతుంది. మా ప్రాంతానికి తీసుకువెళ్ళి వైద్యం చేయించుకుంటాము అని ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో ఒప్పించి, కొంత పైకము వారినుండి సహాయంగా తీసుకొని గుంటూరు జనరల్ ఆసుపత్రిలో చేర్చాలనుకున్నారు. అక్కడ వారు చేర్చుకోలేదు. చేసేది లేక మా అన్నా, వదిన వాళ్ళ ఇంటికి తీసుకువచ్చారు. అక్కడ ఒక రెండు నెలలు ఉన్నాను. ఏవిధమైన వైద్యమూ లేదు కేవలం బెడ్ రెస్టు తప్ప. అక్కడినుండి నా భార్య వాళ్ళ అమ్మగారింటికి తీసుకు వచ్చారు. పాపం వారు చాలా బాధపడినారు. కూతురు సంతోషంగా కాపురం చేస్తుందని పెండ్లి చేస్తే ఇలా ఎందుకూ పనికి రాని శవంగా ఉన్న నన్ను మళ్ళీ మనిషిని చెయ్యటానికి పూనుకున్నారు. నాలుగైదు నెలల్లో కొంత మెరుగైంది. కర్ర పట్టుకొని నడవగలిగాను. తర్వాత ఇంకొక నెల రోజుల్లో కర్ర లేకుండా కూడా నడవగలిగాను. అప్పటికే ఒక కాలు సన్నబడటం జరిగింది. పోలియో కాలులాగా కుడికాలు సన్నబడి బలహీనమై పోయింది. ఇంకా మా అత్తగారి ఇంట్లో ఉండి వారికి బరువుగా ఉండటం మంచిది కాదనిపించింది. ఇప్పటికి వాళ్ళు మమ్మల్ని మా బిడ్డను మోస్తున్నారు. అత్తగారిల్లు 'బలుసుపాడు' గ్రామం. అమరావతి దగ్గర, గుంటూరు జిల్లా. మా సొంత గ్రామం అంబాపురం చేరి, అక్కడ తెలిసిన వారి దగ్గర టైలరింగ్ నేర్చుకుంటూ వారికి ఏదో చిన్న పనులు చేసుకుంటూ నాలుగైదు నెలలు గడిపాను. అప్పటికి టైలరింగు పూర్తిగా నేర్చుకుని వారికి సహాయ పడగలిగాను. తర్వాత పీస్ వర్క్‌గా ఆ టైలర్ దగ్గరే పనిచేసి కొంత డబ్బును దాచుకొని మిషన్ కొనుక్కొన్నాను. తర్వాత భార్యను, పిల్లవాన్ని తీసుకొని ఒక పశువుల పాకలో కాపురం పెట్టాను. అది తెలిసినవారిది. అద్దె లేకుండానే ఇచ్చారు. మిషన్ కుట్టుకుంటూ ఒక నాలుగు నెలలు గడిచిన తర్వాత కొంత బియ్యము, అవసరాలకు కొంత డబ్బు సమకూర్చి భార్యకు ఇచ్చి నేను మళ్ళీ పుట్టపర్తికి వెళ్ళి వస్తాను అని చెప్పి పుట్టపర్తికి బయలుదేరి వెళ్ళాను.

●

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

ఇన్నోవేషన్స్ డే

# 'వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మన ఇన్నోవేటర్లను సత్కరించిన గవర్నర్ నరసింహన్










ఉభయ తెలుగు రాష్ట్రాలలో గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకు రావటంలో 'పల్లెసృజన' సంస్థ చేస్తున్న కృషి అందరికీ తెలసిందే. మాతృ సంస్థ అయిన 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' బాటలోనే 'పల్లెసృజన' కూడా పనిచేస్తోంది. ఈ రెండు సంస్థలకి శ్రేయోభిలాషులు, అత్యంత సన్నిహితులు అయిన మన మాజీ రాష్ట్రపతి శ్రీ అబ్దుల్ కలాం గారు ప్రతి సంవత్సరం ఎన్.ఐ.ఎఫ్. వారు బడిపిల్లలకు నిర్వహించే 'ఇగ్నైట్' పోటీలలో కలాం గారి పుట్టినరోజైన అక్టోబర్ 15న ఎన్.ఐ.ఎఫ్. జరిపే 'ఇన్నోవేషన్ డే' రోజున ఆయన చేతులమీదుగా బహుమతులను అందజేసే కార్యక్రమం నిర్వహించడం జరిగేది. ఈసారి కలాం గారు మనమధ్య లేకపోయినా, ఆయన స్ఫూర్తిని ఆధారంగా తీసుకొని 'వందేమాతరం' ఫౌండేషన్ వారు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ అక్టోబర్ 15, 2015 నాడు 'ఇన్నోవేషన్ పండుగ' పేరున కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 'పల్లెసృజన' చే గుర్తించబడిన ఇన్నోవేటర్లు చింతకింది మల్లేశం, చిడిపి నాగభూషణం, పాండురంగారావు, పందిరి పుల్లారెడ్డి, బొమ్మగాని మల్లేష్, గురుమూర్తి శెట్టి, నాగశ్రీనివాస్, విత్తనాల రమేష్ తదితరులు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమానికి జంట నగరాలలోని పాఠశాల, కళాశాలల పిల్లలతో పాటు చుట్టుప్రక్కల జిల్లాల నుంచి కూడా ఎంతోమంది హాజరై ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉభయ తెలుగు రాష్ట్రాలకి గవర్నర్‌గా వున్న నరసింహం గారు హాజరైనారు. ఆయన కార్యక్రమంలో భాగంగా ముందుగా ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శనని ఎంతో ఆసక్తిగా తిలకించారు. మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఇంతటి ప్రతిభ కలిగి వుండటం చూసి ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ ఎంతో నైపుణ్యం, చదువు, డిగ్రీలు వున్న ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు చేయలేని పనిని పెద్దగా చదువు, ఆర్థిక సామర్థ్యం లేని సామాన్య గ్రామీణులు తమ పరిధిలోనే లభ్యమయ్యే సామానులను ఉపయోగించి, వాటితోనే ఇంతటి అద్భుతాలను సృష్టించారంటే చాలా ఆనందంగా ఆశ్చర్యంగా వుంది. వీరికే కనుక తగ్గ సౌకర్యాలు, ఆర్థిక సహాయము కల్పిస్తే ఇంకా గొప్పగా సమాజానికి పనికి వచ్చే ఎన్నో సృజనలు చేయగలరని నా విశ్వాసం అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకి ఇటువంటి గ్రామీణ ఇన్నోవేటర్లను వెలుగులోకి తీసుకునివచ్చి సమాజానికి ఉపయోగపడేలా తగ్గ చర్యలు చేపట్టాలని తాను తప్పక సిఫారసు చేస్తానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో గవర్నర్ నరసింహం గారు ఇన్నోవేటర్లందరినీ సత్కరించారు. 'వందేమాతరం' ఫౌండేషన్ వారు విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మాతా శిశు సంక్షేమం, ఆడపిల్లల చదువు లాంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తుందని, ఇప్పుడు మా ఇన్నోవేటర్లు తమతమ ఇన్నోవేషన్లను ప్రదర్శించటానికి చక్కని వేదికని, అవకాశాన్ని కల్పించినందుకు వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులకి 'పల్లెసృజన' సంస్థాగత అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం గారు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రదర్శనలో పాల్గొన్న ఇన్నోవేటర్లు హైదరాబాద్ లాంటి మహా నగరం నడిబొడ్డున వున్న రవీంద్ర భారతి లాంటి వేదికపై తమ గ్రామీణ ఇన్నోవేషన్లను ప్రదర్శించటానికి అవకాశం లభించినందుకు ఎంతోమంది బాల బాలికలు, పురజనులు వాటిని ఆసక్తికరంగా తిలకించటం, రాష్ట్ర గవర్నర్ గారే స్వయంగా తమని మెచ్చుకొని సత్కరించటము ఎంతో ఆనందదాయకంగా వుందని అన్నారు.

# 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలు
# బహుమతి పొందిన ఇన్నోవేషన్లు - ఇన్నోవేటర్ల వివరాలు




3వ భాగం

అనువాదం : జె. శశిమోహన్

**జాతీయ రెండవ బహుమతి (మొక్కలు) :**

**సుర్జీత్ బాస్మతి-1 (ఉప్పునీటిని కూడా తట్టుకుని అధిక దిగుబడినిచ్చే బాస్మతి వరి రకం)**

**సుర్జీత్ సింగ్, కర్నాల్, హర్యానా :**



68 సంవత్సరాల సుర్జీత్ సింగ్ స్వతహాగా ఆదర్శ రైతు. అతను ఉప్పు నీటిలో కూడా అధిక దిగుబడినిచ్చే పొడవాటి గింజలు కల 'బాస్మతి' వరి రకాన్ని కనుగొన్నాడు. సుర్జీత్ సింగ్ నివసించే జిల్లా కర్నాల్ సువాసన గల బాస్మతి బియ్యానికి ప్రసిద్ధి చెందినది. ఇతనికి 18 ఎకరాల మాగాణి భూమి ఉంది. దానిలో అతను గత 40 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయంలో కొత్త ప్రయోగాలు చేయటంలో ఇతను ప్రసిద్ధి. బి.ఏ. చదువుకుందామని కళాశాలలో చేరిన ఇతను వ్యవసాయంమీద మక్కువతో కళాశాల చదువును మధ్యలోనే ఆపేశాడు. ఇతనికి వ్యవసాయ పనులలో భార్య, ఇద్దరు కొడుకులు సహకరిస్తూ వుంటారు. వ్యవసాయ క్రమంలో ఈయన ఆధునిక పనిముట్లు, యంత్రాలు వాడుతూ వుంటాడు. చాలా పశువులు కూడా ఉన్నాయి. ఇంటివెనక నీటి గుంటలో చేపల పెంపకం కూడా చేస్తూ వుంటాడు. ప్రభుత్వ సబ్సిడీతో ఒక బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకొని తన కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నాడు.

సుర్జీత్ సింగ్ సాధారణంగా, గోధుమ, వరి,

**కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.**



బఠానీలు, ఆవాలు, ఆలుగడ్డ, పప్పు ధాన్యాలు, మిర్చి, టమోటా మొదలైన పంటలు పండిస్తూ వుంటాడు. 2008లో ఇతను 'పూసా-1460' రకం వరిని నాటగా, అది షీత్ బ్లైట్ అనే తెగులు వచ్చి పంట మొత్తనం చనిపోగా, ఒక్క మొక్క మాత్రమే ఆ తెగులును తట్టుకుని నిలబడింది. అతను దానిని విడిగా పెంచి, 2009లో నర్సరీ పద్ధతిలో వాటిని పెంచి పొలంలో ప్రత్యేకంగా నాటాడు. పంట కోసే సమయంలో ఆరోగ్యంగా వున్న మొక్కల గింజలను సేకరించి, తిరిగి నాటాడు. ఇలా రెండు సంవత్సరాలు చేసిన తర్వాత షీత్ బ్లైట్ రోగాన్ని తట్టుకునే శక్తి ఈ రకానికి ఉందని నిర్ధారించుకున్న తర్వాత దానికి 'సుధీర్ బాస్మతి-1' అని నామకరణం చేసి, తాను నాటడమే కాక, మరొక పదిమంది రైతులకి కూడా పంచాడు. అందరూ చాలా బావుంది, అధిక దిగుబడినిచ్చేది, ఉప్పునీటిలో కూడా మంచి దిగుబడి వస్తుంది, సారవంతం కాని భూముల్లో కూడా మంచి దిగుబడి వస్తుంది అని నిర్ధారించాడు.

'సుర్జీత్ బాస్మతి-1' రకం 'పూస-1460' రకం వరినుండి ఎంపిక పద్ధతిలో రూపొందించబడిన వంగడం. ఇది 125 నుండి 130 రోజుల్లో పంటకు వస్తుంది. హెక్టారుకి 55-60 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది. 67% మొలకెత్తే సామర్థ్యం కలిగి వుంటుంది. గింజ కూడా 11.16 మి.మీ. పొడవుంటుంది. చీడ పీడలను తట్టుకునే శక్తి అధికంగా ఉండటమే కాక, ఏ రకమైన భూమిలోనైనా, ఎటువంటి నీటి వసతినైనా తట్టుకుని పెరుగుతుంది. విత్తటానికి ముందు 24 గంటలు విత్తనాలను నీటిలో నానబెట్టాలి. తర్వాత చదునుగా వున్న నేలపై విత్తనాలను పరిచి తడి గోనెసంచులతో కప్పి వుంచాలి. వాటిపై తడి ఆరకుండా తరచూ నీరు చల్లుతూ వుండాలి. విత్తనం మొలకెత్తటం ప్రారంభిచిన తర్వాత నారు పోయాలి. 35 నుండి 40 డిగ్రీల వేడిలో కూడా నారుమడి వేయవచ్చు. అక్టోబర్, నవంబర్ నెలల్లో పంట కోతకు వస్తుంది. నాణ్యమైన దిగుబడి వుండటం వలన మార్కెట్లో దీనికి మంచి ధర లభిస్తుంది.

దీనిని కర్నాల్ ప్రాంతంలోని 'సెంట్రల్ సాయిల్ సాలినిటీ రీసర్చ్ ఇన్స్టిట్యూట్' వారు రకరకాల పరీక్షలు జరిపి దీని సుగుణాలను ధృవీకరించారు. హర్యానా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు, హిస్సార్ మరియు కె.వి.కె., భివాని వారు కూడా ఇతనిని గౌరవిస్తూ ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. సుర్జీత్ సింగ్ తన 'సుర్జీత్ బాస్మతి-1' రకాన్ని 'పిపివి & ఎస్ఆర్' ఢిల్లీ వారికి రిజిస్ట్రేషన్కై దరఖాస్తు చేసుకున్నాడు.

**జాతీయ రెండవ బహుమతి (మొక్కలు) :**

**జియాన్ ముండి - అభివృద్ధి చేయబడిన 'నల్ల మిరియాలు' రకం :**

**పి.జి. జార్జ్, ఇదుక్కి, కేరళ :**



63 సంవత్సరాల రైతు పి.జి. జార్జ్ అభివృద్ధి చేయబడిన 'నల్ల మిరియాల' రకాన్ని రూపొందించి 'జియాన్ ముండి' అని నామకరణం చేశాడు. ఈ

**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

రకం సాధారణం కన్నా ఎక్కువ దిగుబడినిచ్చి, నీడవున్న ప్రదేశాలలో కూడా పెరిగి, 'ఫుట్‌రాట్' తెగులును తట్టుకునే శక్తి కలిగి వుంది. అసలు కొట్టాయం నుంచి వచ్చిన జార్జ్ పై చదువులు చదివే సదుపాయం, ఆర్థిక స్థోమత లేక 8వ తరగతితో చదువు ముగించాడు. వ్యవసాయానికి భూమి అన్నది అతనికే కాదు, అతను పుట్టిన గిరిజన తెగల వారందరి సమస్య. తమకి భూమి ఇవ్వాలి అని ప్రభుత్వంతో చేసే పోరాటంలో యువకుడుగా వున్నపుడు జార్జి ఒకసారి జైలుకు కూడా వెళ్ళాల్సి వచ్చింది. జీవన పోరాటంతోనే ఇతని యవ్వన దశ గడిచిపోయింది. 1970చివరిలో తనవివాహమైన తర్వాత కొంత డబ్బు ప్రోగు చేసుకొని 'ఇదుక్కి' జిల్లాకి వలస వచ్చేశాడు. తెచ్చుకున్న డబ్బుతో ఒక ఎకరన్నర పొలం కొని వ్యవసాయం ప్రారంభించాడు. ముందు వాణిజ్య పంటలైన రబ్బరు, నల్ల మిరియాలు, కాఫీ, వక్క, కొబ్బరి చెట్లతో ప్రారంభించాడు. అధిక దిగుబడి రావాలనే ఆశతో రసాయన ఎరువులను విరివిగా వాడేవాడు. మొదట్లో బాగానే వున్నా, రానురాను ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గింది. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాల వలన పరిస్థితి ఇంకా దిగజారింది. దీంతో ఇతనికి వ్యవసాయంలో కొత్త పద్ధతులు అవలంభించాలి అన్న ఆలోచన వచ్చింది. మెల్లగా సేంద్రియ, ప్రాకృతిక పద్ధతులను అవలంభించటం ప్రారంభించాడు. అవే ఇప్పుడు అతనిని అభ్యుదయ రైతుగా మార్చాయి. ప్రస్తుతం భార్య, నలుగురు పిల్లలు, వారి కుటుంబాలు.... అందరూ కలిసే వుంటారు, కలిసే వ్యవసాయం చేస్తారు.

నల్ల మిరియాలను జార్జి అంతర పంటగా వేస్తూ వుంటాడు. స్థానికంగా అనేక రకాల నల్ల మిరియాలతో ప్రయోగం చేసి, నలుగురికీ పంచేవాడు. కాకపోతే తన పొలంలో నీరే ఎక్కువగా ఉండటం వలన దిగుబడే ప్రశ్నార్థకంగా ఉండేది. దీనికి తోడు 1985–86లో అధిక వర్షాల వలన 1990లో వేరుకుళ్ళు (ఫుట్ రాట్) తెగుళ్ళ వలన పంటలు పూర్తిగా పోగొట్టుకున్నాడు. దీనితో జార్జి నీడలో కూడా పెరిగి, తెగుళ్ళను కూడా తట్టుకునే మిరియాల రకం రూపొందించాలని నడుం బిగించాడు. స్థానికంగా ఆ ప్రాంతంలో 'తొట్టముండి, నీలముండి' అనే రెండు మిరియాల రకాలు తాను అనుకున్న పరిస్థితులకి పనికి వస్తాయని గమనించాడు. 'తొట్టముండి' రకం ఆ ప్రాంత గిరిజనులు ఎక్కువగా పండిస్తూ వుంటారు. వీటికి రోగనిరోధక శక్తి ఎక్కువగా వున్నా, దిగుబడి మాత్రం తక్కువగా వస్తుంది. ఇక 'నీలముండి' ఎక్కువ దిగుబడి వస్తుంది కానీ, రోగ నిరోధక శక్తి తక్కువ. పరపరాగ సంపర్క పద్ధతిలో 1990లో ప్రయోగాలు ప్రారంభించి, 1998–99 నాటికి తాను అనుకున్న రకం అంటే నీడలో పెరిగేది, రోగ నిరోధక శక్తి కలిగి వున్నది, అధిక దిగుబడిని ఇచ్చే రకాన్ని రూపొందించి, దానికి 'జియాన్ ముండి' రకాన్ని తయారు చేశాడు. 'జియాన్' అంటే దేవుడు నివసించే స్థలం, ఇక 'ముండి' అనేది తాను తీసుకున్న మిరియాల రకం నుండి గ్రహించాడు.



ఈ 'జియాన్ ముండి'

**అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.**

రకం నల్ల మిరియాలు రోగ నిరోధక శక్తి కలిగి వుండటమే కాక, గింజలు పెద్దగా వుండి, గుత్తులు సాధారణ రకాల కన్నా పొడవుగా వస్తాయి. ఇది సేంద్రియ పద్ధతుల ద్వారా పెంచితే అధిక దిగుబడిని ఇస్తుంది. మొక్కలు నాటిన సంవత్సరం తర్వాత పూతకు వచ్చి, కాపు మొదలౌతుంది. గుత్తులు 15 నుండి 20 సెం.మీ. పొడవుండి, ఒకొక్క గుత్తిలో 80–100 గింజల వరకు ఉంటాయి. మొలక శాతం 46గా వుండి, ఒకొక్క తీగకు దాదాపు 7 కిలోల గింజల ప్రకారం హెక్టారుకు 7,700 కిలోల వరకు దిగుబడి వస్తుంది. డిశంబర్ చివర నుండి జనవరి మధ్య వరకు నూర్పిడి చేసుకోవచ్చు. జార్జి ఈ రకాన్ని కేరళ రాష్ట్రం మొత్తం 500 మంది రైతులకి పంచగా, అందరూ చాలా బావుందని కితాబునిచ్చారు. "నేను రూపొందించిన ఈ రకం వలన నేను, నా కుటుంబ సభ్యులే కాక, నా రాష్ట్రం లోని రైతులు, ఇతర ప్రాంతాల రైతులు కూడా లాభ పడాలి" అంటాడు జార్జి. తన పొలంలో స్థానికంగా గిరిజనులు పెంచే అనేక రకాల ఔషధ మొక్కలే కాకుండా, 200 రకాల ప్రత్యేక ఔషధ మొక్కలను కూడా ఈయన పెంచుతున్నాడు. తన ప్రత్యేకత 'మిశ్రమ పంటలే' అంటాడు జార్జి. దానికి ప్రకృతిసిద్ధమైన పద్ధతులే వాడితే, దిగుబడికి ఢోకా లేదంటాడు. జార్జి తన పొలంలో బ్రెజిల్ దేశానికి చెందిన 'తిప్పాలి' రకం మిరియంతో కలిపి 'జైన్‌ముండి' రకాన్ని 'జియార్గ్రేన్' పద్ధతి ప్రకారం ప్రయోగం చేసి, మిరియపు తీగను కాక, చెట్టుని రూపొందించాడు. దీనికి ఆయన 'పులియాన్ మక్కళ్' అని పేరు పెట్టాడు. ఇటువంటి చెట్లు ఆయనవద్ద వెయ్యికి పైగా ఉన్నాయి. జార్జి తన పొలంలో వున్న పళ్ళ చెట్లపైకి పాకుతూ పదిహేను వందల జైన్‌ముండి నల్ల మిరియాల తీగలను పెంచుతున్నాడు. ఇదే కాక ఆయనవద్ద 26 రకాల నల్లమిరియాలను పండిస్తున్నాడు.

ఈయన ఎలుకలు, పందికొక్కుల బెడద లేకుండా నీడలోనే కర్రపెండలం పండించే వినూత్న పద్ధతి కూడా కనుగొన్నాడు. ఈ పద్ధతి ప్రకారం సాధారణంగా వచ్చే దిగుబడికన్నా నీడలోనే అనేకరెట్లు ఎక్కువ దిగుబడి వస్తున్నది. ఇదే కాక, వేప ఆధారంగా ఒక ప్రత్యేకమైన చీడ పీడల నివారణ మందును కూడా ఈయన కనుగొన్నాడు.

జార్జి సాధించిన ఈ విజయాలు దూరదర్శన్, జీవన్ టివి, రిపోర్టర్ టివి, గుడ్నెస్ టివి, ఆకాశవాణి మొదలైన అనేక ప్రసార మాధ్యమాల ద్వారా బహు ప్రాచుర్యం పొందాయి. అనేక బహుమానాలు, గొప్ప గుర్తింపు వచ్చింది. ఎంత వచ్చినా, తాను సేంద్రియ పద్ధతి ద్వారా వ్యవసాయం చేయటంలో ఇంకా ఎన్నో ప్రయోగాలు చేసి, రైతు సోదరులకు అందిస్తాను అంటాడు జార్జి.

**జాతీయ రెండవ బహుమతి (పశువైద్యం) :**

**కోళ్ళలో శ్వాసకోశ వ్యాధికి ఆయుర్వేద వైద్యం :**

**శాతాదల్ ఘోరాయ్, నారుగోపాల్ ఘోరాయ్, పూర్బా, మెడినీపూర్, పశ్చిమ బెంగాళ్ :**

కోళ్ళ ఫారాలలోని కోళ్ళకు శ్వాసకోశ వ్యాధి ప్రాణాంతకమైనది. వ్యాధి వచ్చిన కోళ్ళు తుమ్ముతూ శ్వాస ఆడక గుంపులు గుంపులుగా చనిపోతూ వుంటాయి. శాతాదల్, నారుగోపాల్ అనే ఇద్దరు సాంప్రదాయ వైద్యులు. తమ పద్ధతిలో కోళ్ళకు చికిత్స చేస్తూ వుంటారు.

శాతాదల్ ఘోరాయ్, 55 సంవత్సరాల వితంతువు. ఆమె యుక్త వయస్సునుండే సాంప్రదాయ వైద్యం చేస్తూ వుంది. కూలిపని చేసే ఆమె భర్త చిన్నతనంలోనే చనిపోగా, చిన్నపిల్లలతో కుటుంబ పోషణ భారం ఈమెపై పడింది. ఈమె ఏమీ చదువుకోక పోయినా, తన తండ్రివద్ద నేర్చుకున్న సాంప్రదాయ వైద్యం సహాయంతో కుటుంబాన్ని పోషించసాగింది. ఆయన గ్రామస్తులకి ఉచితంగానే వైద్యం చేసేవాడట. ప్రస్తుతం వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్న తన కుమారుని కుటుంబంతో ఉంటోంది.

1970 ప్రారంభంలో వాళ్ళ గ్రామంలో శ్వాసకోశ





నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.

వ్యాధి వచ్చి అనేక కోళ్ళు చనిపోయాయి. అప్పుడు ఆమె తనకి తెలిసిన వైద్యం చేసి చాలా కోళ్ళను రక్షించింది. ఆ ఉత్సాహంతో తాను ఇచ్చే మందుపైనే ప్రయోగాలు చేసి, అనేక రకాల మిశ్రమాలు రూపొందించి, ఒక ప్రత్యేకమైన మందును తయారు చేసింది. అది కోళ్ళపై బాగా పనిచేయ సాగింది. దాంతో తన గ్రామంలోనే కాక, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో కూడా ఆమెకు మంచి పేరు వచ్చింది. తాను ఆ గ్రామాల్లో వైద్యం ఉచితంగానే చేస్తుంది. అయినా ఎవరైనా ఆప్యాయతతో ప్రతిఫలంగా ఇచ్చే బియ్యము, వడ్లను స్వీకరిస్తుంది. ఆమె తన గ్రామంలోనే కాక, ఆ ప్రాంతంలోనే సమాజ సేవకురాలిగా మంచి పేరు తెచ్చుకుంది. ఎన్.ఐ.ఎఫ్. 2013లో పూర్బ మెదినీపూర్‌లో నిర్వహించిన సాంప్రదాయ వైద్యుల సదస్సులో ఈమె పాల్గొన్నది.

ఇక 51 సంవత్సరాల నారు గోపాల్ ఘొరాయ్ దగ్గరి గ్రామంలోనే కూలి పని చేసుకుంటూ సాంప్రదాయ జానపద గేయాలను పాడుతూ వుంటాడు. ఆయన తన తండ్రి, నలుగురు కుమారులు, కూతురుతో కలిసి నివసిస్తున్నాడు. తాను ఈ సాంప్రదాయ వైద్యం గురువుగారి వద్ద నేర్చుకున్నానని, ఆయనంటే తనకు చాలా గౌరవమని చెప్తారు. ఆయనవల్లనే తనకింత పేరు ప్రఖ్యాతులు వచ్చాయని కూడా చెప్తూ వుంటారు. ఇతనూ వైద్యం ఉచితంగానే చేస్తాడు. కానీ, ఎవరైనా ప్రేమపూర్వకంగా ఏది ఇచ్చినా తీసుకుంటాడు. ఇతను ఔషధ మొక్కలను సేకరించి మందులు తయారు చేయటానికి భార్యా పిల్లలు సహకరిస్తూ వుంటారు. తనకున్న జ్ఞానం నలుగురికి ఉపయోగ పడటంకన్నా కావలసిందేముంది అంటాడీయన. ఈయన కూడా కోళ్ళకు వచ్చే ప్రాణాంతకమైన శ్వాసకోశ వ్యాధికి సంజీవనిగా పనిచేసే మందు ఇచ్చి అనేకమంది రైతులను ఆర్థికంగా చితికిపోకుండా కాపాడాడు.

శాతాదల్, నారుగోపాల్ సమీప గ్రామస్తులే కనుక వీరిరువురూ కలిసి స్థానికంగా వైద్యం చేస్తూ కోళ్ళకు వచ్చే ఈ ప్రమాదకరమైన వ్యాధికి మందు ఇస్తూ వుంటారు. స్థానికంగా దొరికే ఒక మూలిక (పేటెంట్ నమోదైనది కనుక పేరు చెప్పడానికి కుదరదు) తో ఇతర కొన్ని మూలికలను కలిపి కోళ్ళకి వ్యాధి తీవ్రతను బట్టి రోజుకు రెండు లేదా మూడుసార్లు దానలో కలిపి తినిపిస్తే సాధారణంగా 5 రోజుల్లో మంచి గుణం కనిపిస్తుంది.

ఎన్.ఐ.ఎఫ్. ఈ మూలికకు సంబంధించిన పూర్వ చరిత్ర లభించనందున స్వయంగా 'నాగ్‌పూర్' పరిసర ప్రాంతాల్లో ఈ మూలికతో ప్రయోగాలు జరుపగా, ఈ జబ్బు వచ్చిన వచ్చిన కోళ్ళలో రోగ నిరోధక శక్తి పెరిగిందని, చనిపోయే కోళ్ళు కూడా అనేకం బ్రతికాయని నిర్ధారణ అయింది. ఈ శ్వాసకోశ వ్యాధి ఒకటే కాక, 'ఈకోళీ' బ్యాక్టీరియా వలన కోళ్ళకు వచ్చే వ్యాధి కూడా నయమౌతుందని ఎన్.ఐ.ఎఫ్. కనుగొని వీరిద్దరి పేరున పేటెంటుకై దాఖలు చేయటమే కాక, కోళ్ళను పెంచే రైతు శ్రేయస్సుకై ఈ మందును అమ్మే ప్రయత్నాలు ప్రారంభించింది. ●





## 17వ చిన్నశోధయాత్ర

'పల్లెసృజన' నిర్వహిస్తున్న 17వ చిన్నశోధయాత్ర 2016 జనవరి, 8 నుండి 10వ తేది వరకు పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ లోని కన్నాపురం నుండి కొండ్రుకోట వరకు జరుగుతుంది. పాల్గొనదలచినవారు 'పల్లెసృజన' కార్యాలయం ద్వారా కాని, వెబ్‌సైట్ www.pallesrujana.org ద్వారాగాని మీ పేర్లు నమోదు చేసుకుని ఈ జ్ఞానయాత్రలో పాల్గొన గలరు.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959, సెల్ : 9866 00 1678.

మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.

# బోరుబావిలో పడ్డ చిన్నారులను రక్షించే 'పరికరాలు'

## తయారు చేసిన ఆరిపాక రమేష్



తూర్పు గోదావరి జిల్లా కాకినాడ నివాసులైన ఆరిపాక వీరాచార్యులు, అనంత లక్ష్మిల ముగ్గురు కుమారులలో రెండవ వాడు 36 సంవత్సరాల 'అరిపాక రమేష్ బాబు' ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఐటిఐ చదివాడు. చదువు పూర్తయిన తర్వాత శిక్షణోద్యోగి (అప్రెంటిస్) గా పని చేశాడు. ఆ తర్వాత ఎలక్ట్రానిక్ వస్తువులను రిపేర్ చేయటం నేర్చుకుంటూ వివిధ సంస్థలలో ఉద్యోగం చేశాడు. తన ఉద్యోగంలో భాగంగా టివీ, సౌండ్ సిస్టంలను రిపేర్ చేయటం, ఫ్యాక్స్ మెషిన్‌లు, ఇన్‌వర్టర్లు, స్టెబిలైజర్లు, జిరాక్సు యంత్రాల రిపేరి చేయటం లాంటి పనులను చేశాడు. అదికూడా నచ్చక హైదరాబాద్‌లో ఈటీవీలో కూడా ఉద్యోగం చేశాడు. ఉద్యోగం చేసుకుంటూనే 'సెల్‌ఫోన్'ల రిపేరి చేయటం నేర్చుకున్నాడు. ఆ పనిలో బాగా అనుభవం సంపాదించాక ఈ ఉద్యోగాలు చేసుకునేకంటే ఉన్నవూర్లోనే స్వంత వ్యాపారం పెడితే బావుంటుందని ఆలోచించి, తిరిగి కాకినాడ చేరి "రమేష్ మొబైల్ కేర్" అనే షాపును ఏర్పాటు చేసుకుని సెల్‌ఫోన్ల రిపేరి చేయటం ద్వారా తన సంపాదన మొదలు పెట్టాడు.

తన తండ్రి బంగారం పని చేసేవారు. ఆర్థిక ఇబ్బందులు ఎన్ని వున్నా పిల్లలను మాత్రం నిజాయితీగా బ్రతకాలని, పదిమందికి ఆదర్శంగా ఉండాలని సంకల్పంతో పెంచాడు. రమేష్‌కు చిన్నప్పటినుంచే బొమ్మలు గీయటం అంటే చాలా ఇష్టం. 12యేళ్ళ వయసులోనే చాక్‌పీస్‌లపై చిన్న చిన్న బొమ్మలు చెక్కవచ్చు అనే ఆలోచన వచ్చింది. చాలా రకాల ఆకృతులను చాక్‌పీసులతో చెక్కేవాడు. అలా చిన్న చిన్న బొమ్మలను తయారు చేయటానికి అవసరమైన పరికరాలను తానే స్వయంగా తయారు చేసుకున్నాడు.

ఈమధ్య చాలామంది 'సూక్ష్మమైన బొమ్మలు' తయారు చేసి, పేపర్లలోకి ఎక్కడం, ప్రపంచ రికార్డులను సాధించటం చూసి తాను చిన్నప్పుడు చేసిన పనులను మళ్ళీ

**నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.**



మొదలు పెడితే తనపేరు కూడా ప్రపంచానికి తెలుస్తుంది కదా అని తిరిగి 'సూక్ష్మ బొమ్మలు' నూతన పద్ధతులలో చేయటం ప్రారంభించాడు. ఇలా గత ఐదు సంవత్సరాల క్రితం సూక్ష్మ బొమ్మలను తయారు చేయుటం ప్రారంభించాడు. మొదటగా ఒక చిన్న రాగి లోహం ముక్కను తీసుకుని దానితో అతి చిన్న 'శివలింగం' చేశాడు. అది ఎంత చిన్నది అంటే వంటల్లో వాడే 'గసగసాలు' కంటే చిన్నదిగా ఉంది. దాన్ని ఒక సూది తీసుకుని ఆ సూది బెజ్జంలో అమర్చాడు. దాన్ని నిపుణుడైన ఫొటోగ్రాఫర్ 'బూరుగు సుబ్రమణ్య క్రిష్ణ' గారిచే ఫొటో తీయించాడు. దాన్ని చూసిన మిత్రులు ఆశ్చర్యపోయారు. ఇంత చిన్న శివలింగాన్ని మేమెన్నడూ చూడలేదని దాన్ని తయారు చేసిన రమేష్‌ను అభినందించారు. ఆ విషయం వార్తాపత్రికల్లో, టీవీల్లో ప్రసారం కావడంతో ఎంతో సంతోషించాడు రమేష్.

అలాంటి కళాఖండాలు లండన్‌లోని ఒక మ్యూజియంలో మాత్రమే ఉన్నాయని తెలిసింది. ఆ ఉత్సాహంతో ఇలాంటి కళాఖండాలను బంగారంతో తయారు చేయుటం మొదలు పెట్టాడు. సూది బెజ్జంలో ఇమిడేంత చిన్నగా వెంకటేశ్వర స్వామి నామాలు, శంఖ, చక్రాలను తయారు చేశాడు. 0.55 మి.మీ. ఎత్తుగల వినాయకుడి విగ్రహాన్ని, భారతదేశ పటాన్ని, భారత పతాకాన్ని, ప్రపంచ పటాన్ని, క్రికెట్ ప్రపంచ కప్‌ను, బంగారం సైకిల్‌ను, బంగారు కమలం పువ్వును, గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని తయారు చేశాడు. అంతే కాక, సూది మొనపైన ఇమిడేంత శివలింగాన్ని కూడా తయారు చేశాడు. ఒక సూది బెజ్జం (దారం ఎక్కించే రంధ్రం)లో ఇమిడేంత కొలతలతో తయారు చేసిన 'ఏసుక్రీస్తు'ను రూపొందించటంతో ఇది 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది. అంతే కాకుండా ఒక గ్రాఫ్ పేపర్‌లోని ఒక గడిలో ఇమిడేంతగా 'రంజాన్ చంద్రుడిని, 786 అన్న అంకెలను పొందుపర్చి, రంజాన్ రోజున ముస్లిం సోదరులకు శుభాకాంక్షలను తెలియజేశాడు. సర్వమత సమ్మేళనానికి చిహ్నంగా ఒక సూది బెజ్జంలో 'ఓంకారము, మసీదు, శిలువ'లను అమర్చాడు. మతమేదైనా మనమంతా మనుషులం అనే అర్థాన్ని సూచించి, అందరి ప్రశంసలను పొందాడు.

లండన్‌కు చెందిన ఒకతనికి ఇలాంటి మైక్రో ఆర్ట్‌లో అతిపెద్ద మ్యూజియం ఉంది. అతను ప్రపంచంలోనే ఇలాంటి కళాఖండాలను తయారు చేయటంలో ప్రసిద్ధి.. అతను అత్యధికంగా ఒక సూది రంధ్రంలో 9 ఒంటెలను అమర్చగా, రమేష్ భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా ఒక సూది రంధ్రంలో 16 కళాఖండాలను అమర్చి మొదటగా 'బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్స్'లో స్థానం పొందాడు. ఆ తర్వాత 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' మరియు 'ఇండియా బుక్ ఆఫ్



కష్టాల సారాంశమే విజయం.

రికార్డ్స్'లోనూ స్థానం పొందాడు. ఈ విధంగా 16 అతి సూక్ష్మ కళాఖండాలను ఒక సూది రంధ్రంలో అమర్చడం వల్ల ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'గూగుల్ సర్చ్'లో ప్రపంచంలోనే ప్రథమ స్థానం లభించడం, మన తెలుగువాడు సాధించిన ఘనకీర్తిగా చెప్పుకోవచ్చు. ఈ రికార్డును సాధించటంతో ప్రభుత్వ, రాజకీయ, సామాజిక వర్గాల నుంచి ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నాడు రమేష్.

**బోరు బావుల రిస్క్యూ కిట్ రూపకల్పన :**

తన ప్రతిభను అంతటితో ఆపకుండా, సమాజానికి ఉపయోగ పడే పని ఏదనా చేయాలన్న సంకల్పంలో వున్న రమేష్‌కు తరచుగా బోరు బావులలో పసిపిల్లలు పడిపోవటం, అలా పడిన వారు ఎక్కువ మంది పిల్లలు చనిపోవడం అతని మనసును కలచి వేసింది. ఆవేదనతో ఓ పరికరం తయారు చేస్తే బావుంటుందని ఆలోచించి ఒక 'కిట్'ను రూపొందించాడు.

ఈ కిట్ సహాయంతో ఎంతలోతు బోరుబావిలో పడిన చిన్నారులనైనా అతి తక్కువ సమయంలోనే వీలైనంత వరకు సజీవంగా బయటికి తీయవచ్చు. ఈ కిట్‌కు ఒక టార్చి లైటు, చిన్నపాటి కెమరా, ఆక్సిజన్ అందించే ఒక పైపును ఏర్పాటు చేశాడు. దాన్ని బోరుబావి ఎంత లోతులో వున్నా సరే అవసరమైన పైపులను బిగిస్తూ లోపలికి పంపుతూ వుండవచ్చు. దీనికి అమర్చిన బ్యాటరీ ఆధారంగా కనపడే పిల్లవాడిని బైట వున్న వ్యక్తులు దానికి అనుసంధానించిన ల్యాప్‌టాప్‌లో చూస్తూ పిల్లవాడు కనపడగానే పైనవున్న వ్యక్తి చేతిలో వున్న ఒక క్లచ్





సహాయంతో కిట్ ఆ పిల్లవాడిని పట్టుకునే ఏర్పాటు చేశాడు. పిల్లవాడిని ఆ కిట్టు పట్టుకున్న వెంటనే పైకి లాగుతూ వుండాలి. లోపలికి పంపేటప్పుడు బిగించిన చిన్నపాటి పైపులను విడదీస్తూ పిల్లవాడు పైకి వచ్చేలా చేయవచ్చు..

దీనికి సంబంధించిన నమూనా పరికరం తయారు చేసి, చిన్న పిల్లవాడి సైజులో వున్న బొమ్మలను బోరుబావిలో వేసి వాటిని విజయవంతంగా వెలికి తీయటం జరిగింది. ప్రభుత్వం వారు కాని, ఎవరైన స్వచ్ఛంద సంస్థల వారుకాని, తాను తయారు చేసిన నమూనా పరికరాన్ని పరిశీలించి, తగిన ప్రోత్సాహం అందిస్తే ఈ పరికరాన్ని ఇంకా అభివృద్ధిధ చేసి ఎంతోమంది చిన్నారుల ప్రాణాలను కాపాడగలలననే ధీమాను వ్యక్తం చేస్తున్నాడు రమేష్. ఆ పరికరం తయారైన తర్వాత వివిధ జిల్లాలలోని కొంతమంది యువకులకు శిక్షణను ఇచ్చి ఈ కిట్‌లను ప్రతి జిల్లా కేంద్రంలోను, పెద్ద పెద్ద పట్టణాలలోను ఏర్పాటు చేస్తే అతి తక్కువ సమయంలో ఆయా శిక్షణ పొందిన వ్యక్తులు అక్కడికి చేరుకుని చిన్నారులను రక్షించవచ్చు అంటాడితను.

ప్రస్తుతం రమేష్ తయారు చేసిన నమూనా పరికరం ద్వారా, అతని సమకూర్చుకున్న ఆర్థిక స్థోమతతో 50 అడుగుల లోతుగల బోరు బావినుండి చిన్నారులను బయటికి తీయగలనన్న విశ్వాసం అతనికుంది. ఈ పరికరం ద్వారా వందల అడుగుల లోతులో పడ్డ చిన్నారులను రక్షించటానికి కిట్‌ను తయారు చేయాలంటే తనవద్ద తగిన ఆర్థిక స్థోమత లేదని వాపోతున్నాడు.

ఈమధ్య టీవీలలో చిన్నారులు పడినప్పుడు ప్రభుత్వం పడే హైరానా, వార్తా ఛానళ్ళు చూపిస్తున్న హడావిడి అందరూ గమనించే వుంటారు. ఒక్క పిల్లవాడిని బయటకు తీయటానికి ఒకటి, రెండు జెసిబిలు, ఎంతోమంది

పైదాకా ఎక్కటానికి శక్తి కావాలి. అది హిమాలయాలైనా సరే, నీ వృత్తిలోనైనా సరే.

రేయింబవళ్ళు కష్టపడి, బోరుబావి ప్రక్కనే పిల్లవాడు పడ్డ లోతుకు గుంతను త్రవ్వి ఎంతో సమయాన్ని వెచ్చించి, తీరా బయటికి తీసేటప్పటికి ఆ చిన్నారి ప్రాణం అనంత వాయువుల్లో కలిసి పోవటం గమనించే వుంటారు. ఇలా ఒక్క బోరుబావిలోని పిల్లవాడిని రక్షించేందుకు అయిన ఖర్చుతో ఎన్నో కిట్‌లను తయారు చేయటం, తగిన శిక్షణ ఇవ్వటం ద్వారా చిన్నారులను సురక్షితంగా బయటకు తీయగలననే ఆత్మ విశ్వాసంతో వున్నాడు ఆరిపాక రమేశ్.

రమేశ్ చిన్నపిల్లలు బోరుబావిలో పడి మరణిస్తున్న విషాధ సంఘటనలపై చలించి ఆవేదనతో వారిని రక్షించడానికై సరళమైన టెక్నాలజీతో తయారు చేసిన ఈ పరికరాన్ని 'పల్లెసృజన' ప్రభుత్వం దృష్టికి తెచ్చింది, ఉభయ తెలుగు రాష్ట్రాల పోలీసు శాఖలకు తెలియజేసింది. ఈ పరికరాన్ని నవంబర్ 2015లో ఐఐఐటి, హైదరాబాద్‌లో ప్రదర్శించి, రమేశ్‌కు సమాజంలో ఒక ఇన్నోవేటర్‌గా విశిష్ఠ స్థానాన్ని కల్పించింది. బోరుబావుల్లో పడిన పిల్లలను రక్షించడానికి సులువైన పరిష్కారం వుందన్న పరిజ్ఞానం ప్రజలకు, ప్రభుత్వానికి, సామాజిక సంస్థలకు వుంటే మన చిన్నారుల జీవితాలు అనవసరంగా బలి కావని ఇన్నోవేటర్ ఆరిపాక రమేశ్, పల్లెసృజన మనసారా కోరుటుంటున్నాయి.

ఇన్నోవేటర్ వివరాలు : **ఆరిపాక రమేష్**, కాకినాడ. ఫోన్ : 94929 12575




విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.



పల్లెజ్ఞానంతో జీవితంలో వెలుగులు

# గోదాసు నర్శింహ జీవన గమనం

**"నా పిల్లలకు కూడా బ్రతుకు తెరువును ఏర్పాటు చేసింది పల్లెసృజన"**



**మొదట బ్రిగేడియర్ గణేశం గారు నన్ను "పల్లెసృజన" పత్రిక రూపకర్త రాఘవరెడ్డి గారివద్దకు తీసుకు వెళ్ళి వీడియోలు, ఫొటోలు ఇచ్చి నీ కథ మొత్తం చెప్పు, ఆయనే పత్రికలో నీ గురించి వ్రాయాల్సింది అన్నాడు. నా కథ విన్న తర్వాత రాఘవరెడ్డి గారు నాతో అన్నమాట "ఒక మంచి సంస్థకు నీవు పరిచయం అయ్యావు నీకు మంచి భవిష్యత్తు వుంది, తప్పకుండా బాగు పడ్తావు" అన్నారు. ఆ తర్వాత గణేశం గారు, రాఘవరెడ్డి గారు నా ఇన్నోవేషన్‌కు "లావణ్య గుర్రపు డెక్క యంత్రం" అని నామకరణం చేశారు. ఇది జరిగింది 2009వ సంవత్సరంలో. ఆ మాటలు నాకెప్పటికీ గుర్తుంటాయి. వారి సహృదయ స్వభావం వల్ల నా జీవిత గమనమే మారిపోయింది.**

**- గోదాసు నర్శింహ**

అప్పటినుండి మొదలైన నా మార్పు ఆ తర్వాత శ్రీకర్ గారిని కలవడం, 'నాబార్డ్' ద్వారా గుర్రపు డెక్క నిర్మూలించే యంత్రానికి 10 లక్షల రూపాయలు ఋణం మంజూరు చేయించడం జరిగింది. ఆ డబ్బుతో యంత్రం తయారు చేయటం జరిగింది. ఆ తర్వాత హైదరాబాద్ మహానగర పాలక సంస్థ నుండి 5 చెరువులలో గుర్రపు డెక్కను నిర్మూలించే పనిని అప్పగించేలా చేయటం జరిగింది. నర్శింహపైనున్న నమ్మకంతో గణేశం గారు వివిధ సమావేశాల్లో అతని గురించి చెప్పటం వల్ల దుర్గాప్రసాద్ గారి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ నుండి గుర్రపు డెక్క నిర్మూలించే కంట్రాక్టు లభించింది. మొదట చిన్న చెరువులతో ప్రారంభించిన పని ఒక్కటొక్కటిగా ఎదుగుతూ వచ్చి చివరికి హైదరాబాద్ లోని పెద్ద చెరువుల్లో ఒకటైన 'రామకృష్ణాపురం చెరువు'ను శుభ్రం చేసే పని లభించింది.

అతనికి అప్పజెప్పిన పనులను త్రికరణ శుద్ధిగా చేయటం జరిగింది. "పరిశుభ్రంగా మారిన చెరువులను చూసి ఆ ప్రాంత ప్రాజానీకం ఎంతో సంతోషం వ్యక్తం చేయటంతో నావల్ల ఇంతమందికి ఆనందం కలిగింది అన్న సంతోషం ఎన్నటికీ మరువను. విజయవంతంగా నగరంలోని 5 చెరువులను పరిశుభ్రంగా మార్చే అవకాశం కలిగింది. గతంలో 200 నుండి 300 మంది వ్యక్తులతో పనిచేసినా శుభ్రం కాని చెరువులు కేవలం నాలుగైదు మంది కలిసి ఈ యంత్రం సహాయంతో శుభ్రం చేయటంతో నగరపాలక సంస్థలో కూడా మంచి పేరు నిలబెట్టుకున్న వాడ్ని అయ్యాను" అని ఆనందంగా చెప్పాడు నర్శింహ.

ఈ పనులన్నీ చేయటంతో నర్శింహకు ఒకే సంవత్సరంలో కొన్ని లక్షల రూపాయలను ఆర్జించడం జరిగింది. నెలకు వెయ్యి రూపాయల జీతంతో ఒక పాఠశాలలో పనిచేసేవాడు నర్శింహ. ఆ డబ్బుతో కుటుంబాన్ని పోషించడమే గగనంగా ఉండేది. ఏదో చెయ్యాలని తన సామాజిక వర్గమైన 'బెస్త' వారికి ఉపయోగ పడేదని భావించి దాదాపు 20 వేల రూపాయలు అప్పు చేసి మరీ తయారు చేశాడు ఈ గుర్రపు డెక్క నిర్మూలించే యంత్రాన్ని. అది తయారైన చాలా రోజుల వరకు కూడా తాను అనుకున్న గుర్తింపు రాలేదు. వడ్డీకి తెచ్చిన డబ్బు వడ్డీ (మిత్తి) పెరిగి 70 వేలకు మారింది. ఇక ఈ అప్పు తీర్చడం తనవల్ల కాదని, దాదాపు ఆత్మహత్య చేసుకోవడం వైపు తన మనసు దారిమళ్ళుతున్న సమయంలో 'పల్లెసృజన' పరిచయం కావటం, అతని ఇన్నోవేషన్‌ను గుర్తించడం, దాన్ని ఇంకా సమర్థవంతంగా అతని చేతనే తయారు చేయించేందుకు రుణాన్ని

**ఒక దేశం అవినీతి లేకుండా అందమైన ఆలోచనలు కల మేధస్సుతో నిండి ఉండాలంటే నా గట్టి నమ్మకం అది ముగ్గురే చెయ్యగలరు. ఒకరు అమ్మ, రెండు నాన్న, మూడు గురువు.**

మజూరు చేయించడం, అది అద్భుతమైన ఫలితాన్ని ఇవ్వటం జరిగింది. నర్సింహకు ఎన్నడూ ఊహకు కూడా అందని రాష్ట్రపతి భవనంలో తన యంత్రాన్ని ప్రదర్శించి, రాష్ట్రపతి ద్వారా అభినందనలు పొందడం తన జీవితంలో అతి ప్రధాన సంఘటన దాన్ని ఆయన ఎన్నడూ మరువలేడు. నల్గొండ జిల్లా మక్తాపూర్‌లో నా మానాన జీవిస్తున్న నన్ను దేశంలోని అత్యున్నత స్థాయిలో గుర్తింపు రావటం, కోట్లకొలది జనానికి లభించనిది నాకు లభించిందంటే నేనునమ్మలేక పోతున్నాను.

చెరువులను శుభ్రపరచడం ద్వారా లభించిన డబ్బుతో ఒక్క గుంట భూమి కూడా లేని నర్సింహ మూడు ఎకరాల పొలాన్ని కొనటం జరిగింది. అది కూడా ఇప్పుడు దాదాపు 60 లక్షల రూపాయల విలువకు పెరిగటం జరిగింది. ఒకప్పుడు ఏమీ లేని ఒక సాధారణ మనిషిని రాష్ట్రపతి పురస్కారం దాకా తీసుకు వెళ్ళటం వల్ల సమాజంలో తనకింత గుర్తింపు తీసుకు రావటంతో పాటు, తనకు ఆర్థికంగా కూడా ఎంతో ఉన్నత స్థాయిలో నిలబెట్టిన "పల్లెసృజన" ను, అందులో పనిచేస్తున్న విశాల హృదయులకు నేను, నా భార్యా బిడ్డలం కూడా జీవితంలో మరువలేమని అంటాడు నర్సింహ.

ప్రస్తుతం ఒకటి – రెండు యంత్రాలను తయారు చేసి హైదరాబాద్ లోని చెరువులను శుభ్రం చేసే పనిలో పడటం వల్ల నగరంలోని కొన్ని చెరువులు అందంగా తయారయ్యాయి, నాకు కూడా మంచి లాభమే వచ్చింది. కానీ, ఇప్పటినుండి వీటిని ఎక్కువ సంఖ్యలో తయారు చేసి ఉభయ రాష్ట్రాల్లోని దాదాపు జిల్లాకు ఒకటి చొప్పున ఇస్తే తెలుగు రాష్ట్రాల్లోని చెరువులన్నీ శుభ్రంగా తయారు కావటమే కాదు, నేను తెలుగు ప్రజలకు ఒక మంచి వాతావరణాన్ని అందించటంలో భాగస్తుడనయ్యాను అన్న ఆనందంతో పాటు, నాకు కూడా ఆర్థికంగా బావుంటుందని భావిస్తున్నాను అంటాడు నర్సింహ.

తన సృజనాత్మకతను ఈ యంత్రంతో ఆపకుండా ఇప్పుడు మరో యంత్రాన్ని రూపు దిద్దుతున్నాడు. అది కూడా దేశానికి చాలా ఉపయోగకరమైనదే. ఆ యంత్రం ద్వారా ప్రస్తుతం గోడౌన్లలో లారీలకు మూటలు మోసే కూలీల బరువును ఎంతో ఉపశమనం కలిగించేది, లారీల లోడ్, అన్‌లోడ్ ప్రక్రియ త్వరిత గతిన పూర్తయ్యేది. ఈ యంత్రం అతి తక్కువ ఖర్చుతో పని చేస్తుంది. గోడౌన్ యజమానులు తమవద్దకు లారీ వచ్చిన వెంటనే దీన్ని లారీవద్ద ఏర్పటు చేస్తే కూలీలు మూటలను తీసి ఆ యంత్రంపై వేస్తే అది మూటలను లాట్ వేసేవద్దకు తీసుకు వెళుతుంది. అక్కడ కొందరు కూలీలు దాన్ని దించుకుని, లాట్ నెట్టు వేయటం వల్ల ఎంతో దూరం మూటలు మోయాల్సిన పని తగ్గటం వల్ల కూలీల ఆరోగ్యం బాగు పడుతుంది. దీన్ని కూడా పల్లెసృజన ఆధ్వర్యంలోనే తయారు చేస్తున్నాను. మరో నెల రోజుల్లో ఇది పూర్తవుతుంది అన్నాడు నర్సింహ.

పల్లెసృజన నాకు మేలు చేయటమే కాదు, నా పిల్లలు కూడా జీవితంలో భయం లేకుండా జీవించేలా పొలాన్ని సమకూర్చడం.... ఇంతటి మార్పును తన జీవితంలోకి తెచ్చినందుకు 'పల్లెసృజన' కుటుంబ సభ్యులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు అంటాడు గోదాసు నర్సింహ. నావద్ద ప్రస్తుతం డబ్బు రూపకంగా ఏమీ లేదు కానీ, నా జీవితానికి ఓ భరోసా దొరికింది. ఇకముందు నాకింతటి మేలు చేసిన పల్లెసృజనకు నావంతుగా ఏదైనా మంచి చేయాలనుకుంటున్నాను. అందులో భాగంగా ఇప్పటినుండి నాకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని 'పల్లెసృజన' పత్రిక ప్రతి గ్రామానికి చేరటానికి చందాల రూపంలో ఇవ్వాలనుకుంటున్నానని తెలియజేశాడు గోదాసు నర్సింహ.

ఒక సాధారణ వ్యక్తి ఇంతటి మనోధైర్యాన్ని పొందటం 'పల్లెసృజన'కు ఎంతో ఆనందాన్నిస్తోంది. గోదాసు నర్సింహ సృజనకు ఎంతోమంది అధికారులు, సామాజిక సేవకులు స్పందించటంతో రాష్ట్ర స్థాయిలో ఎన్నో పురస్కారా లను అందుకున్నాడు. ప్రతిష్ఠాత్మక రాష్ట్రపతి భవనంలో "ఇన్నోవేషన్ల పండుగ–2015" ప్రదర్శనలో పాల్గొన్నాడు. ఈ ప్రదర్శనను సందర్శించిన కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు గారు నర్సింహం ఇన్నోవేషన్‌కు స్పందించి, విజ్ఞాన భవన్‌లో జరుగుతున్న "స్వచ్ఛ భారత్" సమావేశానికి ప్రత్యేకంగా పిలిపించుకుని తమ కార్యక్రమాల్లో నర్సింహ ఇన్నోవేషన్‌ను వినియోగించుకోమని సలహా ఇచ్చారు.

పల్లెజ్ఞానం అమూల్యం. ఈ జ్ఞానాన్ని మనం సరిగా ప్రోత్సహిస్తే నర్సింహం లాంటి సృజనాత్మక పల్లెవాసులు పేదరికం నుండి విముక్తి చెందుతారు. ఈ జ్ఞానకర్తలను గుర్తించడం సమాజ బాధ్యత. పేదరిక నిర్మూలన పల్లెజ్ఞాన విస్తరణతో కూడా సాధ్యమౌతుందన్న 'పల్లెసృజన' విశ్వాసానికి తార్కాణం గోదాసు నర్సింహ జీవన గమనం. ఇలాంటి మరిన్ని నిజమైన గాథలు వచ్చే సంచికల్లో.....

**ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.**

# 'పల్లెసృజన' ప్రగతి



**మీతో పంచుకుని ఆనందించేందుకు కొన్ని విశేషాలు....**

2014-15 సంవత్సరంలో 'పల్లెసృజన' స్వచ్ఛంద కార్యకర్తలు అందించిన సహకారంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 'పునాది స్థాయి సృజన'లను మీకందించే క్రమంలో జరిగిన కొన్ని ముఖ్య ఘట్టాలను మీతో పంచుకోవటం మాకు ఆనందం కలిగించే విషయం. ఈ ఘట్టాలు సమాజానికి కొంత సమాచారం అందించటంతో పాటు పునాది స్థాయి ఇన్నోవేటర్లకు కొంత ప్రోత్సాహకరంగా వుంటుందని ఆశిస్తున్నాం. ఇక్కడ వివరిస్తున్న సంఘటనలన్నీ పూర్తిగా 'పల్లెసృజన' వాలంటీర్ల విజయాలుగానే మేము భావిస్తున్నాము.

**పదిమందికి చేరుతున్న పల్లె ఇన్నోవేషన్లు :**

✤ ఈ సంవత్సరం చంద్రశేఖర్ తయారు చేసిన 'శ్రీశైలం'ను ఒక ప్రముఖ వ్యాపార సంస్థ సహకారంతో మార్కెట్ చేయటానికి తగు ఏర్పాట్లు చేయడమైనది. ఈ సందర్భంలో అటు ఇన్నోవేటర్, ఇటు పల్లెసృజన సంతృప్తి మేరకు ఒప్పందం వ్రాసుకోవటం జరిగింది. 2013 నుంచి ఇప్పటి వరకు మహిపాల్‌చారి ఉభయ తెలుగు రాష్ట్రాలలో 75 వీడర్లను అమ్మటం జరిగింది. సయ్యద్ సుభాని రూపొందించిన 4 రకాల స్ప్రేయర్లు (ట్రాక్టర్ ఆధారిత, మోటార్ సైకిల్ ఆధారిత, మనుషులు నడిపేది, ఒకే మనిషి ఎక్కువ స్ప్రే చేయగలిగేది) గత రెండు సంవత్సరాలలో 80 యూనిట్ల అమ్మకాలు జరిగినవి. వీటి డిమాండ్ పెరుగుతూ వుండటంతో 2015 చివరి నాటికి వీరిరువురు అన్నదమ్ములు 100 యూనిట్ల స్థాయికి చేరుకుంటారని ఆశిస్తున్నాము. భూమయ్యచారి వందలకొద్ది 'ముక్కు ఫిల్టర్లు' విక్రయించడం జరిగింది. రాజన్న తయారు చేసిన పశువుల మందుల అమ్మకాలు చాలా బావున్నాయి. సైకిల్ నాగలి, కొబ్బరిచెట్లు ఎక్కే మెట్లు, మట్టి కూలర్, వెంకట క్రిష్ణుడు తయారు చేసిన మొక్కల ఎదుగుదల మందు 'తులసి' కూడా 2014-15 లో మంచి అమ్మకాలు జరిగినవి. చింతకింది మల్లేశం 70 వరకు ఆసు యంత్రాల అమ్మకాలు చేయడం జరిగింది. వీటితో మొత్తం 700కు పైగా ఆసు యంత్రాలు పోచంపల్లి నేత కుటుంబాలకు అందినవి. బొమ్మగాని మల్లేష్ 100 సోలార్ స్ప్రేయర్‌లు, 500 రిమోట్‌లను విక్రయించడం జరిగింది. పాండురంగారావు మూడు దక్షిణ భారత రాష్ట్రాలలో మంచి అమ్మకాలు సాధించేందుకు వ్యాపార విస్తరణ చేసుకొని తాను రూపొందించిన పంచరు కాని ట్యూబులను గత 6 నెలలలో 8,000 వరకు అమ్మకాలు సాగించాడు. ఇద్దరు సాంప్రదాయ వైద్యుల ఔషధాలు విక్రయించ టానికి ఒక ఔషధ సంస్థ మార్కెట్ చేయటానికి తగ్గ అవకాశాలను పరిశీలించటానికి ముందుకు వచ్చింది. ఈ సంవత్సరం కనీసం 12 మంది ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తీసుకు రావటానికి ప్రయత్నిస్తున్నాము.

**అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన (ఐ.ఐ.టి.ఎఫ్.)-2014:**

✤ ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వము కొత్త ఢిల్లీలో భారీ స్థాయిలో ఈ వాణిజ్య ప్రదర్శనను ఏర్పాటు చేస్తూ వుంటుంది. ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో ఈసారి 'పల్లెసృజన' తెలంగాణ ప్రాంతం నుండి మూడు ఇన్నోవేషన్లతో ఈ ప్రదర్శనలో పాలుపంచుకుంది. మల్లేష్ తన రిమోట్‌లు, సోలార్ స్ప్రేయర్‌లు ప్రదర్శించగా, పాండురంగం 'ఎయిర్ సీల్' పేరుతో 'పంచరు కాని ట్యూబు'లను ప్రదర్శించాడు. ప్రదర్శనను తిలకించినవారు వీటిని ఆసక్తిగా తిలకించటమే కాక, వివరాలు అడిగి తెలుసుకొని కొనుగోళ్ళు కూడా చేశారు.

**'పల్లెసృజన' ద్వారా సమానాంతరంగా జ్ఞాన వ్యాప్తి :**

✤ తెలుగు సమాజంలో గ్రామ స్థాయి ఇన్నోవేటర్లు, సాంప్రదాయ వైద్యుల, సామాన్య ప్రజల మధ్య జ్ఞాన మార్పిడికై 'పల్లెసృజన' పాటు పడుతుందో అది వాస్తవం అవుతుంది అనటానికి ఒక ఉదాహరణను మీతో పంచుకుంటున్నాము. పల్లజ్ఞానం ప్రజల ప్రమేయంతోనే ప్రస్ఫుటమవుతుంది. పల్లెసృజన పత్రిక ద్వారా పరిచయం చేయబడిన పల్లె ఇన్నోవేటర్లు, వారి ఇన్నోవేషన్లను గురించి ప్రజలు చొరవ చూపి, వారిని సంప్రదించి, జ్ఞానచర్చలు జరుపుతున్నారు. కర్నూలు జిల్లా, ఆత్మకూరుకు చెందిన అబ్దుల్ కరీంకు వెయ్యికి పైగా టెలిఫోన్ ద్వారా, వందలకి పైగా రోగగ్రస్తులు నేరుగా అతన్ని కలవటం జరిగింది. నల్గొండ జిల్లాకు చెందిన ఇన్నోవేటర్ పందిరి పుల్లారెడ్డికి 6వేలమంది ఫోన్ చేయగా, 50 గ్రామాలలో ఆయన ఒక మోటార్‌తో రెండు బోర్లు నడిపే పద్ధతిని ఏర్పాటు చేశాడు. తిరుపతికి చెందిన 'మునిరత్నం నాయుడు' వందకు పైగా గ్రామాలను సందర్శించి, సేంద్రియ వ్యవసాయంపై తాను చేసిన ప్రయోగాలను గురించి రైతులకి అవగాహన కల్పించడం జరిగింది. ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు రైతులు 'సయ్యద్ సుభాని' ని తమ గ్రామానికి పిలిపించుకుని, వారికి కావలసిన విధంగా స్ప్రేయర్‌ను తయారు చేయించుకోవటం జరిగింది. సుభాని వాళ్ళ గ్రామంలో పది రోజులుండి, వారికి కావలసిన విధంగా స్ప్రేయర్ తయారు చేసి ఇవ్వటంతో చాలామంది అటువంటివి కావాలని అడుగుతున్నారు. 'శ్రీశైలం' సమర్థవంతంగా పని చేయటం, రాజన్న పశువుల మందు కూడా ఈవిధంగానే గ్రామం నుంచి గ్రామానికి, వ్యక్తినుండి వ్యక్తికి పాకి ప్రాచుర్యం సంపాదించుకున్నాయి. ఈవిధంగా పల్లెనుండి పల్లెకి సుస్థిర జ్ఞాన మార్పిడి జరుగుతుందన్న సత్యం 'పల్లెసృజన' కలలను సార్థకం చేయడమే అని చెప్పాలి. ఇలాంటి జ్ఞాన వ్యాప్తివల్ల సామాన్య ప్రజలు లాభ పడతారని, ఇతరులపై ఆధార పడకుండా, వారి జీవన వృత్తులను సవ్యంగా సాగించుకుంటారని ఈ జ్ఞాన వ్యాప్తి సత్వర ఫలితాలనిచ్చి నిశ్శబ్దంగా రైతుల దిగుబడిని పెంచటానికి దోహద పడుతుందని మా పరిపూర్ణ విశ్వాసం.

**మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి.**
**ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.**

- **బ్రిగేడియర్ పి. గణేశం,** అధ్యక్షులు,
పల్లెసృజన సంఘం.

**ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?**

ఎడిటర్ గారికి,

నా పుణ్య భారతంలో అతి సామాన్యునిలో కూడా నిక్షిప్తమై వున్న అసామాన్య అనుభవ జ్ఞానాన్ని, సృజన సామర్థ్యాన్ని, నాటి విలువలు కోల్పోయిన (అ)విజ్ఞాన (కు) శాస్త్రీయ ప్రగతి మిధ్యలో కొట్టుమిట్టాడుతున్నవేళ సాధారణ జన బాహుళ్యంలో కూడా ఎన్నో ఆవిష్కరణలని వెలుగులోకి తెచ్చి... వివేకం, సంకల్ప శుద్ధి, బలం వుంటే ఏ విద్యాగంథం లేనివాళ్ళైనా, మింగ మెతుకులు లేని వారయినా సమాజ హితం అందించే అపురూప అవిష్కరణలు చేయగలరని, చేస్తున్నారని నిరూపిస్తున్న 'పల్లెసృజన'కు, అంత దుర్భల పరిస్థితుల్లో కూడా 'నావంతు నేనివ్వాలి' అనే సాహసంతో అకుంఠిత దీక్షతో కృషి చేస్తున్న అందరు చిన్న స్థాయి పెద్ద ఆవిష్కర్తలకు జోహార్లు.

మీ 'పల్లెసృజన'లో చదివే ప్రతి అక్షరం ప్రతి వ్యక్తి సృజనాత్మక పరిశోధనా ఫలాలు నా హృదయాన్ని పులకరింప జేస్తుంది. ఇదీ నేను కలలు కనే నా భారతం!, నా గ్రామాలు. గ్రామీణ జీవన ప్రమాణం, జీవన అనుభవం, జీవన పరిజ్ఞానం చాలు నా దేశాన్ని ఉద్ధరించడాన్కి. ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం పేరుతో విలాసాలకు, ఉన్నత శ్రేణులకు, విదేశీ అవసరాలకు మాత్రమే అండదండలు అందించే యీ పైశాచిక వికృత విజ్ఞానం, నాగరికత ప్రస్తుత భావి తరాలను ఎంత దిగజార్చి వేస్తున్నాయో, ఎంత న్యూన పరిస్థితులకు దారి తీస్తున్నాయో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. పశుత్వం, భౌతిక సుఖాలు.... యివే జీవన లక్ష్యాలని, ప్రగతి ఫలాలని, ధనార్జన, ధనిక స్వామ్యం, ధనపీడనా తత్వాలే మూలాలని చేసుకొన్న నేటి సామాజిక వాతావరణం. మానవుల్ని మృగాలుగా, యంత్రాలుగా, భోగ వస్తువులుగా మార్చేసి, దైవత్వం మాట దేవుడెరుగు, మానవత్వమా నీ ఉనికెక్కడ? బాల్యమా నీ పేరేమిటి? విలువలా అంటే ఏమిటి? కోట్లకు విలువెక్కడ? ఉన్నదంటో ఏముంది మనిషికి యింకా లేదు లేదన్న ఏడ్పులే తప్పా? తృప్తి లేని లేకితనం, ఎంత ఉన్నా లేమితో క్రుంగిపోయే కుంచనత్వం.... ఎంత ఎదిగినా ఎవరికీ అందుబాటు లేకుండా ఎవరి సంబంధం అంటకుండా 'నాకు నేనే' అనే సంకుచితత్వం.... బాధ్యతలు మరచిన అధికార మదం దాహం! తమని కాల సర్పాలై మింగుతున్నా ఆనాళ్ళే మా బంగారు గుహలు అనుకుంటూ యి,కా లోపలికి యిరుక్కుపోయే ప్రజల దుర్భలత్వం.... అధర్మం చేయడానికి వెనుకాడరు. కాని దాన్ని తెలిసి ఎదుర్కొని, ధర్మ పన్నాల దైన్యత్వం. వెరసి మనల్ని మనమే క్షేపం చేసుకునే ఆత్మహత్యా, ఆత్మద్రోహ పరాయణత్వం.

అయినా యింకా అంధకారం పూర్తిగా క్రమ్ముకోనివ్వకుండా ఠాగూర్ చెప్పినట్టు మిణుగురుల లాగా, మిల్లి దీపాల లాగా మీరు వెలుగులోకి తెస్తున్న యీ విజ్ఞాన దీపాలు మన సమాజానికి, దేశానికి, మానవీయతకు, సృష్టికి స్థితి కారకులై లయ ప్రమాదాన్ని అడ్డుకుంటాయి. దేశం గొడ్డుపోలేదు భారతీయ సంస్కృతి నరనరాల అడుగు మడుగుల్లోంచి దుష్కరవేళలెంతటివైనా కమ్ముకునే మేఘాలను చీకట్లను చీల్చుకుని స్వయం ప్రకాశంతో వెలికి వస్తుంది.

మీరు చేస్తున్న కృషి అమోఘం. ఆ చిరు గ్రామీణ ఆవిష్కర్తల యొక్క సృజనలు ఎంతో అభినందనీయం తక్కువ శ్రమతో ఎక్కువ ఫలం! తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం. కార్యసౌలభ్యం కల్గిస్తూ, తమ దైనందిన అవసరాలు, అగచాట్లలోనించే వాటిని అవిష్కరింపజేసుకోవడం.... ఆ సృజనశీలుర విశేషం! ఏ విద్యాగంథం, ఏ శాస్త్ర ప్రవీణ్యం లేనివాళ్ళు, కటిక కష్ట జీవనం గడిపే పేదలు. అయినా వీరంతా పెద్ద భావుకత, యింకా పెద్ద సామాజిక స్పృహ, సేవా తత్పరతలే పెట్టుబడులుగా, తమ స్వంత మేథ, కార్య హస్తాలే సాధనాలుగా, యింతటి వైవిధ్యమైన విజ్ఞాన సంపదని సృష్టిస్తున్నారంటే అవకాశం, ఆసరా ఉంటే యింకే స్థాయికి ఎదుగుతారో. శానిటరీన్యాప్‌కిన్స్ కోసం తనపైనే ప్రయోగాలు చేసుకుని, యంత్రాన్ని ఆవిష్కరించి వేలాది పేద మహిళలకు ఆరోగ్యదానం చేస్తున్న ఒక అరుణాచలం, అమ్మ కష్టం చూడలేక, నూలు పోసే యంత్రాన్ని (ఆసు యంత్రం) కూర్చిన మల్లేశం, మిత్రుడి ప్రమాదంతో చలించి, స్తంభం సులువుగా ఎక్కి, వైర్లు సరిచేయటానికి పాద సురక్షలు చేసిన పాండురంగారావు, రైతులకు సులువుగా నీరందించే గాలిమరలు, బోర్లు కలిపే సౌకర్యాలు, అనేక వ్యవసాయ పరికరాలు, గృహోపకరణాలు..... వెలికి తెస్తున్న బడుగు వైజ్ఞానులు ..... ఓహ్ చూసినకొద్దీ

**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**

ఉత్తేజం.... చదివినకొద్దీ ఉద్వేగం, ఆలోచించినకొద్దీ వీరందరికీ ఏమైనా చేయగల్గితే ఎంత బాగుంటుందనే తాపత్రయం.

మీరు చేస్తున్న ఈ కృషికి ప్రభుత్వాలు చాలవు. జన సామాన్యంలో చైతన్యం రావాలి. మీ శోధయాత్రలు అటువంటి శోధనా యాత్రలే. గ్రామం నుండి గ్రామానికి, నగరాల నుండి గ్రామాలకి, గ్రామాల నుండి నగరాలకి ముఖ్యంగా యువత పరస్పర పరిశఓధనా గమనం సాగించాలి. మీరు చేస్తున్న కృషి విలువ కట్టలేనిది. దాని విలువకు దాని ఫలాన్ని అందుకున్న ఆ చిరు పరిశోధకులే తార్కాణాలు. ఈ వినూత్న వైజ్ఞాన ప్రకంపనలే సాక్ష్యం! ఈ సమాచారాన్ని మీరు తప్పక ఆధునిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సౌకర్యాన్ని వినియోగించి ప్రపంచ వ్యాప్తం చేయగలరని ఆశిస్తూ, విశ్వసిస్తూ, మన యీ భవ్య భారతావనిలో మన బిడ్డలందరు తారాస్థాయికి ఎదగ గలరని, సాంప్రదాయయక, భారతీయ విజ్ఞాన పతాకాన్ని ప్రపంచ శిఖరాలపై ఎగరేస్తారని, మరుగున పడుపోతున్న భారత సంస్కృతే, వైజ్ఞానిక వైభవ మూలాలను భద్రంగా వెలువర్చి, విస్తరించాలని, ఆ దైవం విశ్వ ప్రకృతి తన ఆశీస్సులు అందిస్తుందని విశ్వసిస్తూ.... ఆనంద విషయాన్ని భావుకంగా విశ్వసిస్తూ... ఆశిస్తూ.... పల్లెసృజనని అభినందిస్తూ... మీ అందరి శ్రేయోభిలాషి...

**– స్వరాజ్యలక్ష్మి,** మ్యానేజింగ్ డైరెక్టర్,
పద్మభూషణ్ డా. తిరుమల రావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగ & హ్యూమన్ ఎంపవర్‌మెంట్,
హైదరాబాద్. ఫోన్ : 040–2375455, సెల్ : 93910 05094

**స్వరాజ్యలక్ష్మి గారికి**

కృతజ్ఞతలు, పల్లెసృజన ఉద్దేశ్యాన్ని, విలువలను సామాన్య ప్రజల్లో వున్న అమితమైన క్రియాశీలతను, పరిజ్ఞానాన్ని సంపూర్ణంగా గుర్తించి, అవగాహన చేసుకున్న మీకు మా వందనాలు. మీలాంటి పెద్దల దీవెనలు, ఆశయాలు, మార్గదర్శకత్వాలు మన ఈ 'పుణ్య భారతం'లోని సకల ప్రజలు సవ్య జీవనం సాగించడానికి అనుకూలంగా చేస్తుందని మనసారా విశ్వసిస్తున్నాం. **– ఎడిటర్.**

**బ్రిగేడియర్ పోగుల గణేశం గారికి,**

'సెప్టెంబర్ – అక్టోబర్' పల్లెసృజన సంచికలో వచ్చిన "ధన కేంద్రిక విధానాలు రైతుల పాలిట శాపమా?" అన్న సంపాదయకీయం రైతుల హృదయాన్ని ఎంతగానో ఆకట్టుకుంది. నేను ఒక ఇన్నోవేటర్‌గా కాకుండా ఒక రైతుగా ధన కేంద్రిక విధానాలను గురించి చదవగా ఆ కోణాన్ని చూసేటప్పటికి మనసుకు ఎంతగానో హత్తుకుంది. రైతుకి, ఉద్యోగస్తులకి, రాజకీయట నాయకులకు రైతుని ఏరకంగా తీసుకు వెళ్ళాలి, ఉత్పత్తులు ఎలా పెంచాలి, రైతుకు అందవలసినవి ఏమిటి, అందకూడనివి ఏమిటి, రైతుకి డబ్బు గురించి ఆలోచించేట్టు చేయాలా లేక ఉత్పత్తులను పెంచేవిధంగా ఆలోచన చేయాలా, వారికి కావలసిన రైతు వాడే పనిముట్లు రైతుకు చేరాలా, రైతుకి గిట్టుబాటు ధర లేకుండా చేసి, అప్పులపాలు చేసి, రైతుని అయోమయంలో పడేసి మనం సాధించేది ఏంటి?

'ఈ డబ్బు భాష అర్థం కాక, డబ్బులేని పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని పెంచుకోలేక, డబ్బుతో డబ్బును సంపాదించుకునే జ్ఞానం, అవకాశాలు తెలియక, చీకట్లో దారి వెతుకుతున్న వారిలా కొట్టుమిట్టాడుతున్నారు. అయోమయంలో మునిగిపోతున్నారు, అలవాటులేని పనిని సమర్థవంతంగా చేయలేక పోతున్నారు, ప్రధానంగా ఈ వ్యత్యాసం రైతుల పరిస్థితికి కారణం అనుకోవడంలో తప్పేమీ లేదు.'

అన్న వ్రాతలో గణేశం గారు రైతుల గురించి ఆలోచించినట్లుగా ప్రతి ఒక్కరు రైతుల గురించి ఆలోచిస్తే మనదేశం ఎంతగానో అభివృద్ధి చెందుతుంది.

భారత సైన్యంలో అధికారిగా చేరి, సైనికాధికారిగా దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో పనిచేశారు. ఇన్ని సంవత్సరాలు

**లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.**

మనదేశం గురించి, ఉద్యోగ నిబంధనలు పాటించి, ఆర్మీలో తీరిక సమయం లేకుండా గడిపి, మళ్ళీ రిటైరయ్యాక రైతులను గురించి, సమాజం గురించి ఇంతగా ఆలోచిస్తున్నారంటే మీ గురించి మాటల్లో చెప్పలేం సార్.

నేను ఒక రైతుగా, ఒక ఇన్నోవేటర్‌గా మీకు చేస్తున్న విన్నపం ఒకటి. వచ్చే పల్లెసృజన సంచికలో ఇలా వ్రాయండి. "గత సంచికలోని సంపాదకీయం ఒక గ్రామీణుడిగా, ఒక రైతుగా మీకు నచ్చితే దాన్ని ఒక పది కాపీలు జిరాక్సు తీసి పది మందికి పంచండి. అందులో మీ పేరు, ఫోన్ నెంబరు వ్రాయండి. ఈ వ్యాసం మీకు నచ్చినట్లయితే నాకు మిస్‌డ్ కాల్ ఇవ్వమని అడగండి." అని వ్రాస్తే ఇది ఎంతమంది రైతులకు చేరుతుందో వారికి, తద్వారా మీకు తెలుస్తుందని అనుకుంటున్నాను. నా ఆలోచన బాగుంటే ఆచరించ గలరు.

**– కొల్లి నాగ శ్రీనివాసు,** ఫోన్ : 99486 62652, దొడ్డనపూడి, కాళ్ళ మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

**కొల్లి నాగ శ్రీనివాసు గారికి,**

ఎడిటోరియల్ ద్వారా గ్రామీణుల మనోభావాలను, కఠినమైన సత్యాలను సమాజానికి తెలియజేయటానికి 'పల్లెసృజన' కృషి చేస్తోంది. గత సంచికలో ప్రచురించిన ఎడిటోరియల్‌ను బాగా అర్థం చేసుకున్నందుకు ధన్యవాదములు. మీలాంటి వాళ్ళ ఉద్వేగపూరిత భావాలు, రైతులపట్ల మీకున్న ప్రేమ 'పల్లెసృజన' బృందాన్ని ప్రోత్సాహించి, భవిష్యత్తులో ప్రజాహితమైన కార్యక్రమాలు చేపట్టేలా చేస్తుందని విశ్వసిస్తున్నాం. **– బ్రిగేడియర్ పోగుల గణేశం**

## FORM IV

### PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC

| | | |
|---|---|---|
| 1. | Place of publication | : Ranga Reddy Dist |
| 2. | Periodicity of its publication | : Bi-Monthly |
| 3. | Printer's Name | : Narendra Grafix |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. | Editor's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher

ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.

# అమ్మకానికి సిద్ధంగా వున్న గ్రామీణ శాస్త్రవేత్తల ఇన్నోవేషన్లు

## ఇటుకల తయారీ పరికరం



గుంటూరు జిల్లా అమరావతి నివాసి చంద్రశేఖర్ తయారు చేసిన ఈ ఇటుకల తయారీ యంత్రానికి ఎలాంటి ఇంధనమూ అవసరం లేదు. ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు కలిసి రోజుకు 10 వేల ఇటుకలు తయారు చేయవచ్చు. ఇది మామూలుగా 5 మంది సభ్యులు గల కుటుంబం రోజుకు తయారు చేసే 3 వేల ఇటుకలకంటే మూడు రెట్లు ఎక్కువ. పేదలకు ఇటుక తయారీలో ఈ యంత్రం వల్ల కలిగే లాభాన్ని గుర్తించి జాతీయ స్థాయిలో ఈ సాధనానికి రాష్ట్రపతి బహుమతిని ఇవ్వబడింది.

## ముక్కుకు ఫిల్టర్

**ముక్కు ఫిల్టర్ :** వాతావరణ కాలుష్యం వల్ల మనం పీల్చే గాలి వలన ఎన్నో రోగాలకు గురవుతున్నాము. దీని నివారణకు ముక్కుపై బట్టను కట్టుకుని కొందరు తాము పీల్చే గాలిని నియంత్రిస్తున్నారు. అది కొందరికి ఇబ్బందిగా వుంటుంది. దీని నివారణకు నిజామాబాద్ జిల్లాకు చెందిన భూమయ్యచారి ముక్కు లోపలే ఇమిడే విధంగా ఒక ఫిల్టర్‌ను తయారు చేశాడు. ఇది వాడిన వారు చాలా బావుందని కితాబునిచ్చారు.



## బిస్కట్లు తయారు చేసే చిన్న ఓవెన్



రాజమండ్రికి చెందిన చిడిపి నాగభూషణం తయారు చేసిన ఈ చిన్న ఓవెన్‌తో ఇంట్లోనే బిస్కట్లు, కేకులను వంట చేసుకునే స్టౌపైననే తయారు చేసుకోవచ్చు. దీంతో కుటుంబానికి తాజాగా బిస్కట్లు, కేకులు తయారు చేసుకోవటమే కాకుండా, నిరుద్యోగులు చిన్న తరహా వ్యాపారం కూడా చేసుకుంటూ స్వయం ఉపాధి పొందవచ్చు. దీనికి పెట్టుబడి కూడా తక్కువగానే ఉంటుంది.

పైన పేర్కొన్న పరికరాలు కావలసిన వారు సంప్రదించవలసిన చిరునామా :


**క్రియేటివ్ మైండ్స్**, ఇంటి నెం. 67, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500094.
**ఫోన్ : 040-27111959, మొబైల్ : 96528 01700**


PALLESRUJANA Telugu Bi-monthly 20/- Nov.-Dec.- 2015 RNI No. APTEL 12136/01/01/2011-TC


# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే





**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904